


సృజన

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

52

జనవరి 1974

భారత చైనా ప్రజల మైత్రి వర్ధిల్లాలి!

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

౬౪ పేజీలు 1 రు.

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

1974 జనవరి | మాస పత్రిక | 52

ముఖ చిత్రం : అమరుడు కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి

S R J A N A is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh Hyderabad, Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited and Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'.
Printed at Lakshmi Printing Press for
Venkataramana Mudranalayam, J. P. N. Road, Warangal-506002

మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి!

ఛైర్మన్ మావో 80వ జన్మ దినోత్సవాన్ని యీ డిసెంబర్ 26న ప్రపంచ పీడిత ప్రజలు, వారి పక్షం నిలిచిన విప్లవ కాముకులు జరుపుకుంటున్నారు. ఒక కమ్యూనిస్టు దేశ అధినేత పుట్టిన రోజు పండుగ కాదిది. మావో ఆలోచనా విధానం ప్రపంచ విప్లవాచరణలో ఈనాటి మార్క్సిజం - లెనినిజంగా నిరూపింపబడి, అనుభవంలోకి వచ్చి పీడిత ప్రజలందరూ ఆ వెలుగులో తమ పోరాటాలను పదును పెట్టుకుంటున్న కాలంలో చేసుకుంటున్న పండుగ. సామ్రాజ్యవాదం మొత్తంగా చావుదెబ్బ తింటున్న దశలో ప్రజలు సాయుధ విప్లవాలు కోరుకుంటున్న దశలో వెయ్యి ఆలోచనలు వికసింప చేసిన ఒక వెయ్యి నెలల యువకుడు ప్రపంచ విప్లవ కేంద్ర నాయకుడుగా గుర్తింపబడుతున్న రోజు ఇది. మార్క్సిజం— అనే శాస్త్రాన్ని శస్త్రంగానే కాక ఒక ఉన్నతమైన ఆచరణ సాధ్యమైన నీతి శాస్త్రంగా, ప్రజల అందుబాటులోకి, అనుభవంలోకి వచ్చిన తత్వశాస్త్రంగా తెచ్చిన మహోపాధ్యాయుడు మావో-సె-టుంగ్. ఎంతో కఠినమైన విషయాలను అతి సులభంగా చెప్పగల నేర్పు ఆయనకే ఉన్నది. నేర్పేదానికన్న ప్రజల నుంచి నేర్చుకోవలసిందే ఎక్కువని గుర్తించిన విద్యార్థి ఆయన. ఆయన ఒరవడిలో 'నా విద్యార్థులనుంచి నేర్చుకుంటున్నాను' అనే ఉపాధ్యాయులు 'నా రోగుల నుంచి వైద్యం నేర్చుకుంటున్నాను' అనే డాక్టర్లు ఇవ్వాళ చైనాలో 70 కోట్ల మావోసెటుంగ్‌లు తయారవుతున్నారు. "ప్రజలకు సేవ చేయండి" అనేది మన భారత దేశంలో నాయకుల ఉపన్యాసాల్లో, పెద్దల నీతి ప్రవచనాల్లో అపహాస్యం పాలైన ఒక ప్రవచనం. జన చైనాలో కమ్యూనిస్టు పార్టీని నడిపించే మూల సూత్రం. ఈ దేశంలో మాటలుగా, అందని ఆదర్శాలుగా, గగన కుసుమాలుగా ఉన్న విషయాలన్నీ ఈనాడు చైనాలో అమలై సాగుతున్న నిజాలు. మన దారిద్ర్యంవల్ల, మన వ్యవస్థవల్ల, మన హిపోక్రసీవల్ల ఇంత మహత్తరమైన విషయాలు చైనాలో జరుగుతున్నవన్నా నమ్మలేనంత దయనీయమైన స్థితిలో ఉన్నాం. జీవితంలోని అన్ని సమస్యలకు మావో ఆలోచనా విధానాన్ని అన్వయించుకొని జన చైనా అపూర్వమైన పరిష్కారాలను సాధించుకుంటున్నదని ఇవ్వాళ మనం కళ్ళు మూసుకున్నా ఆగని సూర్యోదయం లాంటి నిజం.

భారతదేశం మహత్తరమైన దేశం, అతి ప్రాచీనమైనదేశం, వీరోచితమైన సంప్రదాయం సంస్కృతికలదేశం. ఇక్కడనుండి ఇతర దేశాలకు నాగరికతను, సంపదను, సంస్కృతిని వ్యాపింపచేసిన దేశం. నూరుకోట్ల చేతులు

ఈదేశాన్ని మహోన్నతంగా పునర్ నిర్మించడానికి తహతహలాడుతున్నాయి. చెమట కన్నీరుగా మారకుండా, కలలు విరిగిపోకుండా, దోపిడిలేని, పీడనలేని, ఒకలోకాన్ని నిర్మించుకోవాలన్నదే మన జనం ఆకాంక్ష. ఇటువంటిదే ఒక జాతి, ఇంత ప్రాచీనమైన, ఇంతమహత్తరమైన సంస్కృతి, సంప్రదాయాలున్న జాతి మావో ఆలోచనా విధానం వెలుగులో ఒక మానవజాతి అనుభవించ దగిన గొప్ప ఫలితాలనన్నిటిని అనుభవిస్తున్నది. ఇవ్వాళ ప్రపంచమంతా జన చైనా సాధించిన ప్రగతిపట్ల స్పందించి సత్యాన్వేషణలో బయల్దేరింది. మన దేశం బ్రిటిష్, అమెరికా, రష్యా సామ్రాజ్యవాదాలు పన్నిన కుట్రలలో, ఉచ్చులలో ఇరుక్కొని తెలివితక్కువ సరిహద్దు తగాదాలు తెచ్చుకొని సూర్యకాంతిని అరచేతితో అడ్డే ప్రయత్నము చేస్తున్నది సరిహద్దు సమస్యలే కానీ ఇతర విదేశ విధానాల్లో అభిప్రాయ భేదాలేకానీ ఉన్నంతమాత్రాన దేశాలమధ్య సంబంధాలు తెగిపోవు. మన ప్రయోజనాలకొరకు కాకుండ సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాలకొరకు 56 కోట్ల భారతప్రజలు 70 కోట్ల చైనాప్రజలకు అందిస్తున్న స్నేహ హస్తాలకు సంకెళ్ళు వేస్తున్నది ఈ ప్రభుత్వం. ప్రపంచంలో ఐదోవంతు శక్తిఅయిన జనచైనాతో ఆరోవంతు శక్తి అయిన భారతప్రజలు స్నేహం కాదల్చుకున్నారు. అప్పుడు ప్రపంచంలో మూడోవంతు మహత్తర ప్రజాశక్తి సామ్రాజ్యవాదమనే కాగితపు పులిని ఎంత సునాయాసంగా కూలగొట్టగలదో అభయం సామ్రాజ్యవాద దేశాల కుండనే ఉన్నది. అందుకే భారతప్రజలు చైనా మైత్రికొరకు తొందర పడుతున్నారు.

ఈనాడు దేశంలో నలుమూలలా అలముకుంటున్న సాయుధరైతాంగ విముక్తి పోరాటాల వెలుగు పాలకవర్గం సృష్టిస్తున్న అన్ని తీర్ల చీకట్లను ఛేదించుకొని మావోఆలోచనా కాంతులను ప్రసరింప చేస్తున్నది. ఈతరుణంలో చైర్మన్ మావో 80వ జన్మదినోత్సవం భారత చైనాప్రజల మైత్రిని సాధించే ఒక సార్థకమైన పండుగగా జరుపుకుందాం.

భారత చైనాప్రజల మైత్రి వర్ధిల్లాలి

భారత రైతాంగ సాయుధ విముక్తి పోరాటాలు వర్ధిల్లాలి

మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి.

చైర్మన్ మావో చిరకాలం జీవించుగాక!



'ప్రజలకు సేవ చేయండి'

నాలుగైదువేల సంవత్సరాల క్రితం చైనాలో వరదలవల్ల గొప్ప ఉపద్రవం ఏర్పడ్డది. గొప్పవాడైన 'యు' వరదలను అరికట్టడానికి అందరికీ నాయకత్వం వహించాడు. ఏ కష్టాలకూ భయపడకుండా వరదలన్నిటిని సముద్రంలోకి మళ్ళించడానికి స్థిరసంకల్పంతో వాళ్ళు పూనుకున్నారు. ఒక రోజు ప్రజలతోపాటు 'యు' తన యింటిముందునుంచే పోవడం తటస్థించింది. ఒక్కసారి యింట్లోకివెళ్ళి చూద్దామనుకున్నాడు. కాని వరదలు చాలమంది యిండ్లను ఎట్లా భీభత్సం చేశాయో ఆ వరదలను తానెట్లా ఎంత తొందరగా అరికట్టాల్సి వున్నదో తెలుసుకొనేసరికి నిలువకుండా కదిలిపోయాడు. చాలా సంవత్సరాల తరువాత మళ్ళీ ఆయన తనయింటి ముందర్నించి పోవడం తటస్థించింది. అప్పుడుకూడా చాల పనిలో వుండడంవల్ల లోపలికి వెళ్ళలేక పోయాడు యు.

వరదలను అదుపులోకి తేవడం దాదాపు పూర్తి అయిపోతున్న తరుణంలో 'యు' మూడవసారి తన యింటిముందునుంచి పోవడం తటస్థించింది. అప్పుడు ఆయన వెంటవున్న అందరూ యీసారి మీరు యింట్లోకివెళ్ళి చూసుకోవచ్చు అని సూచించారు. "పని చివరి భాగం అన్నిటికన్నా చాలా ముఖ్యమైంది. పూర్తయ్యేదాకా మనం పట్టుపట్టాల్సిందే" అంటూ అప్పుడుకూడా లోపలికి వెళ్ళలేదు.

ఈ విధంగా గొప్పవాడైన 'యు' అతనితోపాటు ప్రతివాడూ పదమూడు సంవత్సరాలు తీవ్రంగా పనిచేసి వరదలన్నిటినీ సముద్రంలోకి మళ్ళించారు.

(యీ నాలుగైదు వేల సంవత్సరాలు గడిచిపోయిన యీనాడు ప్రజల కష్టాలు అనే వరదలను విప్లవం అనే సముద్రంలోకి మళ్ళించి ప్రజలకు సేవచేసే 'యు' సంప్రదాయాన్ని విప్లవ సంప్రదాయంగా మలిచాడు చైర్మన్ మావో. నీళ్ళను సముద్రంలోకి మళ్ళించిన 'యు'ను 'యు దిగ్రేట్' అంటున్నాం. కన్నీళ్ళను సంతోషంలోకి, విప్లవంలోకి మళ్ళించిన మావోను ఏమందాం!)

చైనా పునర్నిర్మాణం

పదకొండు సంవత్సరాలక్రితం పెకింగ్‌లో యిద్దరు కార్మిక దంపతు లుండేవారు. వాళ్ళకు 5 గురు పిల్లలు. దంపతులకిద్దరికి జబ్బువచ్చి చని పోయారు పిల్లలు నిరాశ్రయులై పోయారు. ఈకుటుంబంలో అందరికంటె పెద్దవానికి 15 ఏండ్లు, చిన్నవానికి 3 ఏండ్లు. వాళ్ళెట్లా బతికారు?

తల్లిదండ్రులు చనిపోగానే ప్రజా ప్రభుత్వం వెంటనే పిల్లలను బడికి పంపించాలని, వుచిత వైద్యచికిత్స చేయించాలని నిర్ణయించింది. ప్రతినెలా వాళ్ళ జీవనభృతికోసం అలవెన్సులు యిచ్చింది. అట్లా వాళ్ళ బతుకు దెరువు, చదువు కాపాడబడ్డాయి.

పిల్లలు తల్లిదండ్రులను పోగొట్టుకున్నప్పటికి చాలా మంది తలి దండ్రులను పొందారు. యిరుగు పొరుగునున్న చిన్నమ్మలు, చినబాపులు వాళ్ళను తమ పిల్లలవలె చూసుకున్నారు. వాళ్ళకు వండిపెట్టారు. బట్టలు కుట్టి పెట్టారు, వాళ్ళ రోజువారీ జీవితం ఎట్లాఉండాలో నిర్ణయించుకోవడానికి సహకరించారు. యీపిల్లల తలిదండ్రులు చనిపోయినవార్త పత్రికల్లోరాగానే దేశంనిండావున్న తల్లిదండ్రులు యీపిల్లలకు ఎన్నో వుత్తరాలు రాశారు. శ్రద్ధగా చదువుకొమ్మనీ, చైర్మన్ మావో మంచి పిల్లలుగా మారమని ప్రోత్సహించారు. సెలవు రోజుల్లో చాలా సంస్థలు వీళ్ళను సినిమాలకు సాయంత్రం విందులకుపిల్చి సెలవుల్లో తమ సంతోషాన్ని పంచియిచ్చేవారు.

పదకొండు సంవత్సరాలు వీళ్ళ జీవితాల్లో గొప్పమార్పు తెచ్చినవి. యివ్వాళ పెద్దవాడు ప్రభుత్వం క్యాడర్‌లో వున్నాడు. అతనిచెల్లెలు యంత్ర పాఠశాలలో, ఆమె చెల్లెలు యూనివర్సిటీలో చదువుతున్నారు. నాల్గోవాడు ప్రజా విముక్తి సైన్యంలో పనిచేస్తున్నాడు. చిన్నవాడు మిడిల్ స్కూల్లో వున్నాడు. సామ్యవాద సమాజంలో వాళ్ళంతా ఆరోగ్యంగా పైకొస్తున్నారు.

రాల్ఫ్ ఫాక్స్-నవల-ప్రజలు :

నవల—వాస్తవికత

అనువాదం : కొత్తపల్లి రవిబాబు

మహాకావ్యాన్నీ (epic) నవలనీ తరచు పోలుస్తూవుంటాం. మన ఆధునిక బూర్జువా సమాజంలో నవలే మహాకావ్య కళారూపం. ఈ సమాజపు యౌవన దశలో నవల పరిపూర్ణమైన ఔన్నత్యాన్ని సంతరించుకొంది. ప్రస్తుతపు బూర్జువా సమాజపు పతనదశచే ఈ నాటినవల ప్రభావితమైనట్టు కనబడుతోంది ఆధునిక నవలయొక్క మహాకావ్య వారసత్వాన్ని, ఏధినీ ఫీల్డింగ్ తన "వీరోచిత, చారిత్రిక, వచనకవితా నవల" ఐన "టామ్ జోన్స్" ఉపోద్ఘాత అధ్యాయాలలో వివరించాడు. వరదలా వస్తున్న సమకాలీన నవలలకు మహాకావ్య గుణాలాపాదించాలన్న నీచమైన అభిరుచి ఏ విమర్శకునికీ ఉండదు. ఇక్కడ కూడా మన [1] "యులిసిస్" (Ulysees) లోనూ, [2] "స్వాన్స్ వే" (Swans' way) లోనూ, మన [3] "హెన్రియడ్" (Henriade) మరియు [4] "ఇడిల్స్ ఆఫ్ ది కింగ్" (Idyles of the king) పోకడలు చూడవచ్చు.

బూర్జువా సాహిత్యం సృష్టించిన మహత్తర సృష్టి నవల. అది ఒక నూతన కళారూపం. పునర్జాగృతి (Renaissance)తో ప్రారంభమైన ఆధునిక నాగరికతకు పూర్వమే నవల ఏదో ఒక బీజ రూపంలో వుండేది. ప్రతి కళారూపంలాగానే, ఇది కూడా మానవ చైతన్యాన్ని విస్తరించడం, ప్రగాఢం చేయటం అనే వుద్దేశాన్ని నెరవేర్చింది. ప్రాచీన సమాజం అదృశ్యం కావడంతో మహాకావ్యరూపం అంతరిం ినట్లుగా, నవల మన నాగరికతతో పాటు అంతరిస్తుందా? కాని మహాకావ్యం మరోరూపంలో, చారిత్రక వీరగాథా, రూపం (Chanson de geste) లో మరల అవతరించింది. దాని తర్వాత నవల, మహాకావ్య లక్షణాలతో సరికొత్త మానవుడి అవసరాల కనుగుణంగా, అతని కోర్కెలను వ్యక్తీకరించడానికి, అతని సంక్షోభ ప్రపంచాన్ని చిత్రీకరించడానికి అవతరించింది. మన సౌందర్య దృష్టి మహాకావ్య రూపంలో మాత్రమే సంతృప్తి పొందుతుందనిపిస్తుంది. నూతనంగా వచ్చిన సినిమాకళ తన రంగులతోను, శబ్దంతోను, తన సంగీతంతోను (ఈ సినిమా సంగీతం ప్రాచీన సంగీతంతో విభేదించి ప్రత్యేకతను రూపొందించుకుంది) నూతన యుగానికి ఒక మహాకావ్యాన్ని సృష్టించి ఇవ్వగలదా?

ఈ విషయంలో సినిమా చాలవరకు విజయవంతం కాగలదనడాన్ని తిరస్కరించటం అసాధ్యం, కాని మొత్తంమీద అది కష్టమని నా అభిప్రాయం ఎందుకంటే మానవుడి గురించి సంపూర్ణ చిత్రణ ఇవ్వగల అవకాశం నవలకు మాత్రమే వుంది. మానవుడి ఆంతరంగిక జీవితాన్ని అతని నాటకీయత నుండి వేరుచేసి చూపించగల అవకాశం నవలకువుంది. ఇది చలన చిత్రకళకు అసాధ్యం. సినిమా చేస్తున్న సవాలువల్ల నవలకు తాను పోగొట్టుకున్న ముఖ్య గుణాలను మరల సంతరించుకోవాల్సిన అవసరం వచ్చింది. మొత్తంమీద నవలను చైతన్యవంతంచేసి, సరైన చర్యలు తీసుకొనేటట్లు బలవంతంచేయడం ద్వారానే ఇది సాధ్యమౌతుంది. నేరాలంటే, హింసంటే అభిరుచి వుండటం వల్లనే డిటెక్టివ్ నవల ప్రజారంజకం కాలేదు. దేనినైతే సినిమా పెంచి పోషిస్తోందో- అనాటకీయత, దేనినుంచి ఆధునిక నవల కుంచించుకుపోతోందో, ఆ నాటకీయత నవలకు కావాలి.

మహాకావ్యం (epic) ఒక సమాజపు సంపూర్ణ వ్యక్తీకరణకాగా నవల ఎప్పటికీ ఆ స్థాయి చేరలేదు. మహాకావ్యంలో పాత్రలకీ, ఆనాడు సమాజంలో నివసించిన వారికీ సమతుల్యం (balance) వుండేది. ఇప్పుడు అదిలేదు. [5] "ఇలియడ్" అనే మహా కావ్యంలో ముఖ్యమైనది ఒక పాత్రచిత్రణేకాదు. సమాజ చిత్రణే ప్రధానం. వ్యక్తి సమాజంకంటె భిన్నమైనవాడని అనుకోని సమాజ చిత్రణ ప్రధానం. వ్యక్తి తన సమాజంలో ఒక భాగం. అంతేకాదు ప్రకృతిలో అతనొక భాగం. కాకపోతే ప్రకృతి అతనిపై అధికారం చలాయిస్తుంది. కాని ఎప్పుడూ ప్రకృతితో సంఘర్షణ లేదు. ప్రకృతిపై ఆధిపత్యం లేదు. [6] "ఛాన్సన్ డి రోలండ్" (Chanson de Roland) అనే మహాకావ్య కథ కూడా క్రిస్టియన్లు ఒకవైపు, దాని వ్యతిరేకులు మరోవైపుగల రెండు రకాల సమాజాల మధ్య ఘర్షణే! [7] ఛార్లమీన్ (Charlamagne) [8] రోలండ్ (Roland), [9] ఆలివర్, [10] గానిలన్ (Ganelon), [11] ద్రోహం చేసిన వీరుడు- ఈ పాత్రలన్నీ నమూనా పాత్రలేగాని వ్యక్తులుకాదు. తెలివితేటలు, ధైర్యం, విశ్వాసం, ద్రోహం మూర్తీభవించిన నమూనా పాత్రలు ఇవి.

వ్యక్తిగంతగా స్త్రీ, పురుషుల కష్టసుఖాలు, ఆంతరంగిక జీవితాలు కథా వస్తువుగావున్న కథ, ప్రాచీన గ్రీకో- రోమన్ నాగరికత ఛిన్నాభిన్నమవడంతో, కెల్టిక్ జాతుల పతనంతో ప్రారంభమైంది. స్వయం పోషక సమాజాలు పోయాయి. కథ ఇపుడు [12] డాఫ్నిస్ అండ్ క్లో (Daphnis and Chloe),

[13] ట్రిస్టాన్ అండ్ ఇజుల్ట్ (Tristan and Iseult) లో లాగా కాస్మాపాలిటన్ ఐంది.

నవల వ్యక్తి విషయం చర్చిస్తుంది. అది ఒక వ్యక్తి సమాజానికి వ్యతిరేకంగా, ప్రకృతికి వ్యతిరేకంగా చేసే సంఘర్షణకు మహాకావ్య స్థాయిలో రూపకల్పన అని చెప్పాలి. మనిషికి సమాజానికి మధ్య సమతుల్యత (Balance) పోయినపుడు, మనిషి తన చుట్టూవున్న వారితో, ప్రకృతితో పోరాడే సమాజంలో మాత్రమే నవల అభివృద్ధి పొందగలదు. అటువంటి సమాజం పెట్టుబడి దారీ సమాజమే. [14] ఒడిస్సీ (Odyssey), [15] రాబిన్‌సన్ క్రూసో (Robinson Crusoe) ఈ రెండూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రెండు గొప్ప కథలు, కాని అవి రెండూ ఎంత భిన్నమైన కథలు! చరిత్ర కందని సమాజంలో ఒడిసియస్ (Odysseus) నివసించాడు. అతని సమాజంలోగల వుక్కొటి పురాణాలను, వాస్తవాలను వేరుచేయలేం. ఆ రోజుల్లో మనిషికి భయానకమైన విషయాలేవీ లేవు. సముద్ర ప్రయాణీకుడైన ఒడిసియస్‌కు తన జీవితం ప్రకృతిపై ఆధిపత్యం గల దేవుళ్ళ చేతుల్లో వుందని తెలుసు. తుఫాను, [16] పొసీడన్ (Poseidon) అనే సముద్ర దేవుడు సృష్టించిందనీ, ఓడ ప్రమాదం తన సుదీర్ఘమైన ప్రయాణంలో మరో పరీక్ష అని అతనికి తెలుసు, కనుక అప్పటివారికి భయానకమైన విషయాలేవీ లేవు.

రాబిన్‌సన్ క్రూసో విషయంలో అలాకాదు. "ఫ్యూడల్ సమాజపు అంతిమ దశనూ, 16వ శతాబ్దంనుంచి ప్రారంభమైన నూతన ఉత్పత్తి శక్తులను తనలో ఇముడ్చుకున్న ఈ 18వ శతాబ్దపు వ్యక్తిగత చరిత్రకు సంబంధించిన ఆదర్శంగా కనబడతాడు." అని మార్క్స్ రాశాడు. ఒడిసియస్‌కు చరిత్రే లేదు. అతను ప్రపంచపు శైశవదశలో నివసించాడు. దేవుళ్ళు అతనికి ఆత్మీయులు. రాబిన్‌సన్ గతాన్ని కాలదన్నాడు. తన చరిత్ర తానే నిర్మించుకోడానికి ప్రయత్నించాడు. అతను తన శత్రువైన ప్రకృతిపై ఆధిపత్యం చలాయించడానికి తయారుగావున్న నూతన మానవుడు. రాబిన్‌సన్ ప్రపంచం వాస్తవిక ప్రపంచం. అతను భౌతిక వస్తు సముదాయానికి సంబంధించిన విలువలతో నిండిన ఈ ప్రపంచాన్ని స్పష్టంగా వర్ణించాడు. భయంకరమైన తుఫాను అతని ఓడనూ, ఓడలో సామానునూ ప్రమాదకర పరిస్థితిలో పెడుతుంది. తన తోటి మనుష్యులేమో సముద్రపు దొంగలు, తిరుగుబాటు దారులు, ఇతరులపట్ల క్రూరులు, దయాహీనులు, కాని క్రూసోకు తనపై తనకుగల నమ్మకం,

ఆశావాదం, తన అదృష్టానికై చేసే సాహస కృత్యాలలో వచ్చే తప్పులను సరిదిద్దుకోడానికీ, ప్రకృతి చూపించిన క్రూరత్వంనుంచీ, తనతోటి ప్రయాణీకుల పాశవిక శతృత్వంనుంచి తప్పించుకోడానికి సహాయపడ్డాయి. సముద్రాల కావలనున్న అతని ఆదర్శ ప్రాంతం కనుగొనగల్గాడు.

దేశ బహిష్కారం పొందిన ఒక రష్యన్ యువరాజుకు తాను ఆ ద్వీపంలో గడపిన జీవితాన్ని, అక్కడ తన అధీనంలో వున్న ప్రజతో కాలం ఎలా గడిపిందీ చెప్పాడు క్రూసో. వారు, ముఖ్యంగా యువరాజు అతనికథ విని ఆశ్చర్యపోయారు. "ఎవరి జీవితానికి వారు అధికారులు కావడమే జీవితంలో సాధించాల్సిన ఉన్నత లక్ష్యం" అని యువరాజు అభిప్రాయపడ్డాడు. కనుక తనపై తాను అధికారం సంపాదించుకున్న క్రూసో యొక్క సుదీర్ఘ సముద్ర ప్రయాణం ఒడిస్సీ (Odyssey)లో లాగా, ఇథాకాకు తిరిగి రావటంతోగానీ, తమను వివాహమాడమని [17]పెనొలిపి వద్దకు వచ్చిన వారితో చేసిన యుద్ధంతోగానీ, అస్వస్థతకులోనైన పెనొలిపి (Penolepe), [18]టెలిమాకస్ (Telemachus)లు ఇచ్చిన ఆహ్వానంతోగానీ పూర్తికాదు. పైపెచ్చు అతని ప్రయాణం సైబీరియాకు చేసిన ఆఖరి యాత్రతోనూ, ఎల్బికి తిరుగు ప్రయాణంతోనూ ముగుస్తుంది.

"ఇక్కడ నేను, నా సహచరుడు మా వస్తువులకు సైబీరియాలోని సెబిల్ (Sable) జంతువులకున్నంత గిరాకీ వున్నట్లు తెలుసుకున్నాం. అఖరకు మేము సంపాదించిందంతా పంచుకుంటే, నా భాగం క్రింద మూడువేల నాలుగు వందల డెబ్బైఐదు పౌండ్లపదిహేడు షిల్లింగుల మూడు పెన్నీలు (బెంగాల్‌లో నేను కొన్న ఆరువేల పౌండ్ల విలువగల వజ్రాలు కలిపి)గా తేలింది. ఒడిసియన్ జీవితం లాగానే రాబిన్‌సన్ జీవితం ఒక విచిత్ర యాత్రాగాథ. ఒడిసియన్ కథ లాగానే ఇదికూడా "విశ్రాంతి తీసుకోవడంతోనూ, చివరి దినాలు శాంతియుతంగా గడవటంతోనూ" అంతమైంది. కాని ఒడిసియన్ లక్ష్యం మొదట్నించీ, ట్రాయ్ యుద్ధానంతరం ఇంటికి తిరిగి రావటమేకాగా, రాబిన్‌సన్ సముద్ర ప్రయాణ లక్ష్యం ఇంటిని వదలి వెళ్ళటమేకాని ఇంటికి తిరిగి రావటంకాదు. అతను ఒక సామ్రాజ్య నిర్మాత. ప్రకృతిని ఎదిరించి గెల్చినవాడు. అతడు తన బహుమతిని చాల కష్టపడి సాధించినవాడు.

18వ శతాబ్దమంతా ఆర్థిక శాస్త్ర ఉపన్యాసాలకు "రాబిన్‌సన్ క్రూసో" నవల ఆధారమైంది. నిజానికి దాని ప్రతిధ్వనులు [19]జాన్‌స్టువర్ట్

మిల్ రచనలలో వినపడ్తున్నాయి. నూతన బూర్జువాజీ తన గాయకుణ్ణి గుర్తుపట్టింది. ఆ గాయకుడు సోమరికాదు. అతడు పాడినపాట పనికి మాలినది కాదు. మానవ జీవిత యాత్రలో ఒక నూతన యుగపు ద్వారంవద్ద అతను నించున్నాడు. ప్రపంచం ఒక రెండు శతాబ్దాల కాలవ్యవధిలో పూర్తిగా మారిపోవాల్సిన పరిస్థితి అది. మనిషి గాలిలో ఎగరటాన్ని, భూమిని ఏడు అడుగులలో చుట్టిరావటాన్ని, సముద్రాలపై అధిపత్యం సంపాదించడాన్ని గురించి ప్రాచీన కవుల కలలు సఫలం కాబోతున్న పరిస్థితి అది. ఈ కలలను సఫలం చేయడంలో ప్రాచీన ఉన్నత సంస్కృతిని ధ్వంసం చేస్తూ, మనిషికి మనిషికి మధ్యగల సంబంధాలను దిగజారుస్తూ, మానసిక జీవితానికంటే వ్యాపారానికీ, బూట్ పాలిష్‌కు ఉత్తమ స్థాయినిస్తూ, మానవ జీవిత సిసలైన గుణానికి మోసమనే దళసరి ముసుగువేస్తూ, మనిషి తనను తానే పూర్తిగా మార్చుకున్నాడు. ఇటువంటి సంబంధాలు మునుపు మనుష్యుల మధ్య ఎప్పుడూ లేవు.

పెట్టుబడిదారీ సమాజం అభివృద్ధి చెందిన కొద్దీ, అది కళాకారునికి ఇంతకు ముందున్న సాంఘిక వ్యవస్థలు అతనికిచ్చిన స్థానం కంటె పూర్తిగా భిన్నమైన స్థానాన్ని ఇచ్చింది. పెట్టుబడిదారీ సమాజపు తొలిరోజులలో అంటే పునర్జాగృతి కాలంనుండీ, 18వ శతాబ్దం సగం గడిచే వరకూ, ఇది అంత స్పష్టంగా కనబడదు. అప్పుడుకూడా రచయితకు మానవుణ్ణి వున్నవాడిని వున్నట్లుగా చూడగల్గిన స్వేచ్ఛ వుంది. రచయిత మానవుడి గురించి పూర్తి చిత్రణ చేయగల్గేవాడు. వర్తమానాన్ని, మధ్యయుగాన్ని విమర్శించగల్గేవాడు. క్లుప్తంగా చెప్పాలంటే, వాస్తవికతను ఒక పద్ధతిగా సృష్టించిన పెట్టుబడిదారీ సమాజం, దానికి నవలలో సంపూర్ణమైన రూపం ఇచ్చింది. మానవుణ్ణి కళా సృష్టికి కేంద్రంగా చేసింది, కాని చివరకు వాస్తవికత విలసిల్లవలసిన పరిస్థితులను నాశనం చేసి, మానవుణ్ణి కళలో మాత్రమే, ప్రత్యేకంగా నవలలో నిర్వీర్యునిగాను, వికృతంగాను కనబడటానికి మాత్రమే అనుమతించింది. థియొఫిల్ గాషియర్, ఫ్లాబర్ట్ అశ్లీలత గురించి 1857 లో జరిగిన విచారణ గురించి సమీక్షిస్తూ, ఇలా అన్నారు. "వాస్తవానికి నేను చేసే వ్యాపారానికి నేను సిగ్గు పడుతున్నాను. ఆకలితో చావకుండా వుండటానికి నేను సంపాదించవలసిన భృతికి ఫలితంగా, నేను ఆలోచించే దానిలో సగమో లేక ఒక పావు మాత్రమే చెబుతాను. కాని నేను రాసే ప్రతి వాక్యానికి, కోర్టుముందుకు లాగబడే పరిస్థితిని ఎదుర్కోవాలి." "జొనాథన్ వైల్డ్" (Jonathan wilde)

నవల కాలంనుంచీ, ఫ్లాబర్ట్ కేసుపై గాషియర్ చేసిన తీవ్రమైన వ్యాఖ్యకాలం వరకూ మధ్యగల కాలపరిమితి వంద సంవత్సరాలే కాని ఈ మధ్యలో ఎంత మార్పు వచ్చింది!

పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందడం, యంత్ర పరిశ్రమలస్థాపన ద్వారా ఒక మనిషిని మరో మనిషి దోచుకునే పద్ధతి పెరగటం, స్వేచ్ఛగా ఉత్పత్తి చేసుకునే రైతుగానీ, కళాకారుడుగానీ తన హక్కును వదలు కోవటం— ఈ కారణాలన్నిటివల్ల కళ పతనమైంది. భూస్వామ్య విధానం నుండి పెట్టుబడిదారీ విధానంకు మారుతున్న సంధికాలంలో— అంటే పునర్జాగృతి కాలపు నాటి మహత్తర కళా ఖండాల స్థాయికి చేరగలవాటిని కళ ఉత్పత్తి చేయలేక పోయింది. అంతేకాదు గ్రీకు, రోము జానిన సమాజాలనాటి ఉత్తమ కళాస్థాయికైనా కనీసం చేరుకోలేక పోయింది. చైనాలో ఉత్తర ప్రాంతపు భూస్వామ్య పరిపాలన కాలంనాటి కళా స్థాయినైనా అందుకోలేక పోగా, పైపెచ్చు వ్యక్తికీ, సమాజానికి మధ్య ప్రగాఢమైనదిగా కనబడే వైరుధ్యంవల్ల అణచివేయబడిన కళాకారుణ్ణే మరింత పతనదశకు తీసుకు పోయింది.

సాంస్కృతిక జీవితంలో ఈ క్షీణ దశకుగల వాస్తవ కారణాలను కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్సు, ఎంగెల్సులు బట్టబయలు చేస్తూ పాత సాంఘిక సంబంధాలను నాశనం చేయటంలో బూర్జువాజీ యొక్క విప్లవ కరపాత్రను వర్ణించారు

"బూర్జువా వర్గంది పైచేయి అయిన చోటల్లా అది సకల ఫ్యూడల్ సంబంధాలనూ, సకల పితృస్వామిక సంబంధాలనూ, సకల నిష్కపట జానపద సంబంధాలను నిర్మూలించింది. మానవుణ్ణి జన్మతః తనకంటె అధికులైన వాళ్ళ"కు ముడివేసిన కలగాపులగపు ఫ్యూడల్ సంబంధాలను బూర్జువావర్గం నిర్దయగా పటాపంచలు చేసి, మనిషికీ మనిషికీ మధ్య నగ్నమైన స్వలాభంతప్ప కిరాతకమైన డబ్బు లావాదేవితప్ప, యిక యే సంబంధాన్నీ మిగులనివ్వలేదు. మతావేశంవల్లా, రణోత్సాహంవల్లా, మూర్ఖపు మమకారం వల్లా కలిగే అలౌకిక ఆనందాలన్నిటినీ అది స్వలాభమనే కత్తితో ఖండించి వేసింది. అది మనిషి విలువను రూపాయల్లోకి మార్చివేసింది. రాజ శాసనాలు ప్రసాదించిన అసంఖ్యాకమైన సుస్థిర స్వాతంత్ర్యాలను అంతమొందించి, వాటికి బదులు

"వ్యాపార స్వాతంత్ర్యం" అనే ఏకైక ముష్కర స్వాతంత్ర్యాన్ని నెలకొల్పింది. ఒక్క మాటలో చెప్పాలంటే బూర్జువా వర్గం మన రాజకీయ భ్రమల ముసుగుచాటున జరిగే దోపిడీని తొలగించి, దాని స్థానంలో నగ్న, లజ్జారహిత, ప్రత్యక్ష పాశవిక దోపిడీని నిలిపింది.

"గతంలో ప్రజల భక్తి గౌరవాలకు పాత్రమైన వృత్తుల నన్నిటినీ బూర్జువా వర్గం నీచస్థాయికి తీసుకువచ్చింది. వైద్యులనూ, న్యాయవాదులనూ, కవులనూ, శాస్త్రవేత్తలనూ అది తన కింద కూలికి పనిచేసే నౌకర్లుగా మార్చి వేసింది."

కోట్లాది బడుగు ఉత్పత్తిదారులకు ఆస్తి లేకుండా చేసి, పెట్టుబడి దారీ విధానం అద్భుతమైన చదును చేసే విధానాన్ని పాటించింది. ఈ విధానమే సాంస్కృతిక సంబంధాలలో గూడా అవలంబించబడింది, వ్యక్తి యొక్క శ్రమ శక్తి ఒక వస్తువుగా మారిన తర్వాత అతను నైతికమైన విలువలుగాని, సౌందర్యగతమైన విలువలుగాని లేనివానిగా తయారయ్యాడు. వస్తుమార్పిడి విధానం (Commodity exchange) వస్తువులన్నిటిని సమాన దృష్టితో చూస్తుంది. అలాగే కళకూడా ఒక వస్తువైంది. దానికి వ్యతిరేకమైన, శత్రువులైన వస్తువులతో అది సమానంగా పరిగణింపబడింది. బానిసత్వము, అర్థబానిసత్వము (Serfdon), దోపిడీ విధానాలపై ఆధారపడిన ప్రాచీన లేక ఫ్యూడల్ సమాజాలలోని వ్యక్తిగత సంబంధాలలో ఒక మనిషి మరో మనిషిపై ఆధారపడటం మరింత ప్రత్యక్షంగా వుండేది. శ్రమ విభజన మామూలుగా వుండేది. వ్యక్తి ప్రత్యక్షంగా చేతిపనులలో నైపుణ్యం ప్రదర్శించగల్గేవాడు. అటువంటి సమాజాలలోని కళకు ఒక నూతనత్వం, ఒక చేతనత్వం వుండేది. అవి రెండూ ఇప్పుడు మృగ్యమై పోయాయి.

దీనిని రస్కిన్, విలియం మారిస్‌లు అర్థం చేసుకున్నారు. కాని ఈ నూతనత్వాన్ని మరల వ్యక్తి ఆస్తి ఆధారంగా వున్న పెట్టుబడిదారీ సమాజాన్ని విప్లవాత్మకంగా నాశనం చేయడం ద్వారా గాకుండా, కృతకమైన మధ్య యుగాలనాటి సాంస్కృతిక దశకు పోవటంద్వారా సాధించవచ్చునన్న గొప్ప తప్పిదాన్ని చేసారు. మారిస్ మాత్రం తన చివరి రోజులలో మార్క్స్ ప్రభావంవల్ల ఈ తప్పుడు అభిప్రాయంనుండి బయట పడ్డాడు.

పెట్టుబడి కేంద్రీకరణ జరగటం వలన క్రొత్తగా వ్యక్తులమధ్య ఏర్పడిన బాహ్యాత్మక (in personal) సంబంధాలను 19వ శతాబ్దంలో సృజనాత్మక

కళాకారులు గాఢంగా అనుభవించారు పెట్టుబడిదారీ మార్కెట్ ద్వారా తమ రచనలు నేలమట్టం కావటంకూడా అంతే గాఢంగా అనుభవించారు. డబ్బు అన్నిటినీ సమానం చేసేస్తుంది. సబ్బులు, నూనెలు లాంటి గృహోపకరణ వస్తువులు తయారు చేయటంద్వారా కోటీశ్వరుడైనవాడు ఒక మైకేల్ ఏంజిలో కళాఖండాన్ని కొన్నాడంటే అర్థం, ఆ కళాఖండాన్ని ఇంత నూనెకు, కొన్ని సబ్బులకు కొన్నట్టే లెక్క, అలాగే ఇంపీరియల్ రసాయనిక పరిశ్రమలో భాగస్థుడైన ఒక ఆసామీ ఇచ్చిన విరాళంతో షేక్స్పియర్ నాటక ప్రదర్శనలు లండన్‌లో ఒక ప్రాంతమైన వెస్ట్ ఎండ్ (West End) లో జరిగితే- ఆ ప్రదర్శనలన్నీ కొంత పరిమాణం గల ఎరువుతో సమానం అనుకోవచ్చు. నూతన బూర్జువాజీపట్ల అనాగరికమైన ద్వేషంతో, 19వ శతాబ్దపు నవలా రచయిత ఈ సామాన్య సమీకరణలను అసహ్యించుకున్నాడు. కాని అతని ద్వేషం నూతన సమాజపు కొన్ని మంచిగుణాలను చూడనీయకుండా గుడ్డివాణ్ణి చేసింది.

ఆధునిక కాలంలో కోటీశ్వరుడు తన వర్గానికి శిఖరాయమానంగావటం విజ్ఞాన శాస్త్రాభివృద్ధి వల్లనే సాధ్యమైంది. అతను ఈ విజ్ఞాన శాస్త్రం తనకు లాభదాయకం గనుక దానికి సహాయం చేస్తాడు. విజ్ఞాన శాస్త్రాభివృద్ధిలోనూ, విజ్ఞాన శాస్త్రానికి తమ జీవితాలు అర్పించి నూతన ప్రపంచాన్ని కనుగొన్న ఫారడే, పాస్చర్, క్యూరీల జీవితాలలోనూ మనం మన యుగపు నిజమైన కవిత చూడగలం. వారే మనయుగపు నిజమైన కథానాయకులు. కాని 19వ శతాబ్దపు నవలాకారుడు తాను నివసిస్తున్న బూర్జువా ప్రపంచం చూచి దిగ్భ్రాంతుడై 1848లో మహత్తరమైన కలలు కల్పించిన ఫ్రెంచి విప్లవపు అంతిమ వైఫల్యంవల్ల నిరాశకులోనై, శ్రామికవర్గం కనబడటంతో భయభ్రాంతుడై వుండుటచేత ఈ సత్యాన్ని గుర్తించలేక పోయాడు. గాన్‌కోర్ట్ సోదరుల 1857 సంవత్సరపు డైరీ ఈ దృక్పథాన్ని ప్రదర్శిస్తుంది.

"విజ్ఞాన శాస్త్రరంగంతో కూడా కలిపి, ఏ యుగమూ ప్రపంచాన్ని ఇంతగా మోసంచేయలేదు. కొన్నేళ్ళతరబడి రసాయన భౌతికశాస్త్రాలురోజూ ఒకమూలపదార్థాన్నో, అద్భుతాన్నో క్రొత్తలోహాన్నో చూపిస్తామంటున్నాయి. అంతేగాక మనలను మారణహోమం చేయటమో లేక శతవయస్కులుగా చేయటమో చేయగలమని చెపుతున్నాయి. ఇదంతా ఒక పెద్ద మోసం. దీనివల్ల ఆ యా శాస్త్రజ్ఞులు బిరుదులు పొందటమో, పింఛను పొందటమో, లేక పేరు,

ప్రఖ్యాతులు తెచ్చుకోవడమో జరుగుతుంది- అంతే. ఈ మధ్యలో జీవన వ్యయం రెట్టింపు, మూడింతలు పదింతలు పెరుగుతుంది. పుష్టికరమైన ఆహారానికి చెందిన ముడి సరుకులు లేకపోవడమో లేక తగ్గిపోవడమో జరుగుతుంది. యుద్ధంలో మరణాల విషయంలో కూడా అభివృద్ధి వుండదు. [ఇది సెబాస్టపోల్ (Sebastopol) లో ఋజువైంది.] మంచి బేరమనుకున్నదంతా మహా చెత్త బేరమైంది."

విజ్ఞాన శాస్త్రవేత్తలు మృత్యుముఖంగా గొప్ప అభివృద్ధి సాధించినట్లు ఋజువు చేసుకున్నారు. శాస్త్రవేత్తలు సాధించిన ఈ దుష్టఫలితమే నవలాకారులకు ప్రీతి పాత్రమైంది. విజ్ఞాన శాస్త్రాన్ని జీవితాన్ని మార్చగల్గేశక్తిగా గుర్తించడం, శాస్త్రవేత్తల జీవితానికీ వారు సాధించినదానికి మధ్యగల వైరుధ్యాన్ని గుర్తించడం, పెట్టుబడిదారీ విధానం వారిని ఉపయోగించుకున్న పద్ధతిని గమనించడం లాంటి విషయాలు గాన్‌కోర్ట్ సహోదరులు తమ సాహిత్యానికి వస్తువుగా ఎంచుకోకుండా ఎలా నిర్లక్ష్యం చేసారో అలాగే ఈనాటి నవలాకారులు చేస్తున్నారు.

19వ శతాబ్దమంతా, కళాకారుడు అంగీకరించని ప్రమాణాలను తనపై బలవంతంగా రుద్దాలని ప్రయత్నించే ప్రపంచాన్ని తిరస్కరించటమనే విఫలమైన పోరాటం చేసినట్లు గమనించాం. తమ గాజు మేడలో తాము కులుకుతూ కళ కళ కోసమేనన్న వాదన కొందరు చేసారు. నిజానికి కళకు ఆర్థికమైన విలువతప్ప ఇక ఇతరంగా ఎటువంటి విలువా ఇవ్వని నాగరికతకు ఈ నినాదం ఒక సవాలు. కళ కళ కోసమే అన్న నినాదం కళ డబ్బుకోసమే అన్న నినాదానికి ఒక చెత్త సమాధానం. చెత్త అని ఎందుకంటున్నానంటే మేడ కట్టుకోడానికి గాజు మంచి పదార్థం కాదు కనుక.

గెరార్డ్ డి నెర్వాల్ (Gerard de Nerval) లాంటి వాళ్ళు ఉరిపోసుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఇతరులు, నిరాశ నిస్పృహలతో తమ రచనలను తామే తిరస్కరించారు. కవిత్వంలో విప్లవాత్మక ప్రయోగాలు చేసిన పారిస్ కమ్యూన్ నాటి యువకవి రింబాడ్ (Rimbaud) జీవచ్ఛవంగా మారి తాను ద్వేషించే బూర్జువాజీకి ఆఫ్రికాలో ఉత్పత్తి అయ్యే వస్తువులలో ప్రీతిపాత్రమైన ఆయుధాలు, మానవ శరీరాల వ్యాపారాన్ని, అబిసీనియాలో చేయసాగాడు. గాగిన్ (Gaugin) తహతి (Tahiti)లో Polynesia

అదిమ కమ్యూనిస్టులతో పాటు నివసించడానికి వెళ్ళాడు. తన కుటీరాన్ని తన కళాఖండాలతో అలంకరించుకున్నాడు. సెజాన్ (Cezanne) తన కళా ఖండాల్ని మురికి గుంటల్లోకి విసిరివేసాడు. వాన్‌గో (Van Gogh) తన జీవితాన్ని పిచ్చివాళ్ళ ఆస్పత్రిలో చేరటంతో పూర్తి చేసుకున్నాడు.

కాని ఇదే సమయంలో వీరి స్నేహితుడు, వీరిని బలపరిచేవాడు ఐన ఎమిలీజోలా, పరిష్కారం కోసం చిత్తశుద్ధితో చీకటిలో తడుముకుంటున్నాడు. అతను అప్పటికే శ్రామికుల జీవితాలలోని చేదునీ, దైన్యాన్నీ, ఆగ్రహాన్నీ గమనించడంవల్ల, అతనిలో ఒక నూతనోత్తేజం పనిచేయడం ప్రారంభించింది. కాని జోలా తన పూర్వీకుల తప్పుడు సిద్ధాంతాలను యాంత్రికమైన ప్రకృతి సూత్రంగా (Mechanical doctrine of naturalism) అభివృద్ధి చేయడంతో తన అన్వేషణలో విఫలుడయ్యాడు. ఉదారపూర్వకమైన (Generous) ఈ వైఫల్యంనుండి మనం చాలా నేర్చుకోవచ్చు.

అసలు రహస్యం చాల దగ్గర్లోనేవుంది. కళ వికసించాల్సిన పరిస్థితులను పెట్టుబడిదారీ విధానం ఒకవైపు ఏ విధంగా నాశనం చేస్తుందో, మరోవైపు ఏ విధంగా కళ ఉన్నతోన్నత స్థాయినందుకోడానికి పరిస్థితులు ఎలా కల్పిస్తుందో మార్క్స్, ఎంగెల్స్ వివరించారు. కాని పెట్టుబడిదారీ విధానం ఆ పరిస్థితులను తనకు మద్దతుగా ఉపయోగించుకోడానికీ, తనదైన ఒక నూతన కళను సృష్టించుకోడానికీ అశక్తురాలు. చరిత్రలో ప్రప్రథమంగా అది ప్రపంచ సాహిత్యం, కళల సృష్టికి పరిస్థితులను కల్పించింది. మొత్తం ప్రపంచాన్ని తన రూపంలోకి దించింది. సాంకేతికంగాను, ఉత్పత్తి విషయంలోను సాధించిన ప్రగతివల్ల "వెనుకబడిన" ప్రజలు, "అభివృద్ధి పొందిన" ప్రజలువుండటం సాధ్యంకాని పరిస్థితులు ఏర్పడ్డాయి. "కమ్యూనిస్టు ప్రణాళిక"ను మరోసారి ఇచట ఉదహరిస్తాను.

"......ఉత్పత్తిలో నిత్య విప్లవమూ, సాంఘిక పరిస్థితులలో నిరంతర కల్లోలమూ, అనంతమైన అనిశ్చితత్వమూ, ఆందోళనా- ఈ గుణాలవల్ల బూర్జువాయుగం యితర యుగాలకంటె విలక్షణంగావుంది. స్థిరపడి ఘనీభవించిన సంబంధాలు అన్నీ, వాటిని అంటిపెట్టుకొనివుండే పురాతన పూజ్య అభిప్రాయ దురభిప్రాయాలు అన్నీ కొట్టుక పోయినాయి; కొత్తగా యేర్పడే సంబంధాలు స్థిరపడకముందే పాతబడి పనికిమాలినవై పోతున్నాయి. గట్టి

దనుకున్నదంతా కరిగి గాలిలో కలిసి పోతున్నది. పవిత్ర మనుకున్నదంతా మైల పడిపోతున్నది. చివరకు మానవుడు భ్రమలు తొలగించుకొని తననిజమైన జీవన పరిస్థితులనూ, తోటి మానవులతో తనకుగల సంబంధాలనూ యెదుర్కోక తప్పలేదు."

"బూర్జువావర్గం ఉత్పత్తి చేసే సరుకులకు నిత్యం విస్తరించే మార్కెట్ కావాలి గనుక, ఆ అవసరం ఆ వర్గాన్ని ప్రపంచపు నలుమూలలకూ తరుముతుంది. ఆ వర్గం అన్నిచోట్లా గూడుకట్టుకోవాలి, అన్నిచోట్లా స్థిరనివాసం యేర్పరచుకోవాలి, అన్నిచోట్లా సంబంధాలు నెలకొల్పుకోవాలి."

"బూర్జువా వర్గం ప్రపంచమంతటినీ తన మార్కెట్‌గా చేసుకోవడం ద్వారా ప్రతి దేశంలోను సరుకుల ఉత్పత్తికీ, సరుకుల వినియోగానికీ జాతి మతాతీత స్వభావం కల్పించింది. సనాతన వాదులకు మనః క్షోభ కలిగేటట్లుగా అది పరిశ్రమల కాళ్ళకింద జాతీయ భూమిని తొలగించివేసింది; పురాతన కాలంలో స్థాపించబడిన జాతీయ పరిశ్రమలన్నీ నాశనమైనాయి. యింకా యేమైనా మిగిలివుంటే అవి రోజురోజుకూ నాశనమౌతున్నాయి. వాటి స్థానంలో కొత్త పరిశ్రమలు వస్తున్నాయి- సకల నాగరిక జాతులకూ జీవన్మరణ సమస్య ఐన పరిశ్రమలు, దేశీయ ముడి పదార్థాలనుగాక దూరాతిదూర ప్రాంతాల ముడి పదార్థాలను వినియోగించుకునే పరిశ్రమలు, ఉత్పత్తి అయ్యే సరుకులు స్వదేశంలోనేగాక ప్రపంచపు నలుమూలలా అమ్మకమయ్యే పరిశ్రమలు. పాతకాలపు అవసరాలు స్వదేశపు ఉత్పత్తులతోనే తీరేవి; వాటి స్థానంలో కొత్త అవసరాలు వచ్చి, దేశాంతర, ఖండాంతర వస్తువులు అవసరమైనాయి. గతంలో వివిధ ప్రాంతాలూ, వివిధ జాతులూ దేనిపాటికది ఏకాంతంగా, స్వయం సమృద్ధంగా బతికేవి, యిప్పుడా పరిస్థితి పోయి, నలువైపులా యిచ్చి పుచ్చుకోవడమూ, సర్వత్రా వివిధజాతులు ఒక దానిపై ఒకటి ఆధారపడడమూ జరుగుతున్నది. భౌతిక వస్తువుల ఉత్పత్తిలోవున్న పరిస్థితే బౌద్ధిక ఉత్పత్తికి (Intellectual Production) కూడా వర్తిస్తుంది. వివిధ దేశాల బౌద్ధిక ఉత్పత్తులు యావత్ ప్రపంచపు సమిష్టి ఆస్తి ఔతున్నాయి. జాతీయ ఏకపక్ష వికాసమూ (one-sidedness), సంకుచిత మనస్తత్వమూ అంతకంతకూ అసంభవ మౌతున్నాయి. వివిధ జాతీయ, ప్రాంతీయ సాహిత్యాల నుండి విశ్వ సాహిత్యం ఉద్భవిస్తున్నది."

కాని ప్రపంచ సాహిత్యం ఒక రోగిష్టి శిశువు. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం దానిసృష్టికి కారణభూతమైన పరిస్థితులను కల్పించగా, ఆ పరిస్థితులే దాని అభివృద్ధిని అటంకపరుస్తున్నాయి. వర్గశత్రుత్వం, బలహీన దేశాల అభివృద్ధిని బలీయమైన దేశాలు అటంక పరచడం, అడ మగా విచక్షణ, అడామగా శత్రుత్వం, గ్రామాలకూ పట్టణాలకూ మధ్యగల శత్రుత్వం, పెద్ద ఎత్తున వస్తూత్పత్తి చేయటంవల్ల మానసిక శ్రమ, శారీరక శ్రమ మధ్య పెరిగిపోతున్న అఖాతం– పెట్టుబడిదారీ సమాజంలోని వైరుధ్యాలవల్ల వస్తున్న ఈ అంశాలన్నీ ప్రపంచ సాహిత్యాభివృద్ధికి ఆటంకాలుగావున్నాయి. కళలో వాస్తవాన్ని చిత్రించగల్గే మహా కావ్య లక్షణాలను పునరుద్ధరించగల్గడమే నవలాకారుని సమస్యలకు విప్లవాత్మకమైన పరిష్కారం. అధునిక సమాజంలోని సత్యాన్ని గుర్తించినట్టి పరిష్కారం అది.

[కమ్యూనిస్టు ప్రణాళిక నుండి ఉదహరించిన
పేరాల అనువాదం రా. రా. ది. ప్రగతి–మాస్కో ప్రచురణ]

వి వ ర ణ లు

యులిసిస్, స్వాన్స్ వే : అధునిక రచనలు, ఆంగ్ల సాహిత్యంలో

హెన్రియడ్; ఇడిల్స్ అఫ్ ది కింగ్ : ప్రాచీన రచనలు, ఆంగ్ల సాహిత్యంలో

Chanson de geste: 11వ శతాబ్దం నుంచి 15వ శతాబ్దం వరకు ఫ్రెంచి సాహిత్య చరిత్రలో ప్రముఖ స్థానమాక్రమించిన చారిత్రక వీరగాథ (Epics) లకు ఇచ్చినపేరు. ఇలాంటి వాటిలో మొట్ట మొదటిది. Chanson de Roland.

ఛార్లమీన్, రోలండ్, ఆలివర్, గానిలన్ : Chanson de Roland లో ప్రముఖ పాత్రలు.

ఇలియడ్ : గ్రీకు మహాకావ్యం.

Do-phnes and Chloe: డాఫ్నిస్ అనే అతను సిసిలీ గొర్రె కాపర్ల నాయకుడు. గోపికా కవితకు అద్యుడు. క్లో అనేది అకుపచ్చ పైరుల దేవత ఐన Demetes కు బిరుదు.

Tristan . మధ్యయుగాల కాల్పనిక సాహిత్యంలోని ప్రసిద్ధ నాయకులలో ఒకడు. ఐరిష్ రాకుమార్తె ఇజుల్ట్ (**Iseult**) ను ప్రేమిస్తాడు. రిచర్డ్ వాగ్నర్ (**Richard Wagner**) వీరి విషాదాంత ప్రేమ గాథను తన అమర సంగీతంలో ఆలాపించాడు.

Odyssey : గ్రీకు మహాకావ్యం- రచయిత హోమర్ (**850. B. C.**) ట్రోజన్ యుద్ధంపై ఆధారపడిన మహాకావ్యం. కథా నాయకుడు **Odysseus.**

రాబిన్ సన్ క్రూసో: ఇంగ్లిషు నవల.

Poseidon : గ్రీకు పురాణ గాథలలో సముద్ర దేవుడు.

Flaubert : 1821, 1880 మధ్య నివసించిన ఫ్రెంచి నవలా రచయిత. 'మేడమ్ బొవరీ' నవల రచించాడు. రచయితపైనా, రచనపైనా అశ్లీలత ఆరోపణపై విచారించారు. 1857లో విడుదలయ్యాడు. తాను మరణించే సమయానికి వాస్తవిక వాదిగా ప్రసిద్ధిచెందాడు

Jonathan wild : ఫీల్డింగ్ రాసిన నవల (1743).

Gerard de Nervol : 1808, 1855. ఫ్రెంచి సాహిత్య వేత్త. జనవరి 25, 1855న ఉరి తీసుకున్నాడు. అతని సాహిత్యశైలి చాల నిరాడంబరంగాను, స్వచ్ఛంగాను ఉంటుంది.

Rimbaud : 1854–91. ఫ్రెంచి కవి.

Gaugin, Cezanne, Van Gogh : చిత్రకారులు.

Emile Zola : ఫ్రెంచి నవలా రచయిత. 1840_ 1902. ప్రయోగశాలలో లాగ పరిశోధన, పరిశీలన నవలలో ప్రతిబింబించాలంటాడు.

పాటలు:

ఈరయ్యా మాలీ....!

యం. కె. సుగమ్ బాబు

ఏమిలాబం? ఏమిలాబంరా??
ఈరయ్య మాలీ-
ఏమిలాబం? ఏమిలాబంరా??

పదును సేసీ, పాదు సేసి
ఇత్తు నాటీ, కంచెసుట్టి
నీల్ల మారుగ నెత్తురోసీ
కంటిరెప్పగ కాపలుండి
ఎండవానకు తలనుయిచ్చీ
గొడ్డు శాకిరి సేసిసేసీ
పిన్న మొక్కను సెట్టు సేత్తే
కాయలెవరికి సేతికందేను?
ఈరయ్య మాలీ...
నీడ ఎవరికి సేద తీర్చేను??

ఆలుబిడ్డల ఆవలెట్టి
పగలురేయి మరసిపోయి
నిండు బతుకును దారబోసీ
నడుం వంగి, గుండె కుంగి
ఆకలై నువు సేయిసాత్తే
సెట్టు ఏమని జవాబిచ్చేను?
ఈరయ్య మాలీ...
పండు ఎందుకు అందకుండేను??

నారు జోసీనోడుతప్పక
నీరు పోత్తాడనీ నమ్మిన
దేవుడేమీ పలక కుండాడేం?
ఈరయ్యా మాలీ...
ఎదురొచ్చి నిలిసి
బతుకు బరువును దింపకుండాడేం??

నిన్ను మించిన బంటులేడని
మెప్పుకోల్లే పలికి పలికి
నువ్వు పెంచిన ధనం ధాన్నెం
ఇల్లలో గుట్టలుగ బోసీ
నోరుతెరిసీ నువ్వడిగితె
తలుపు మూసీ తియ్యకుండాడే?
కామందులోడు
పోలిసోడిని కాపలెట్టాడేం?
పెజారాజ్జెం! పెజారాజ్జెం
వచ్చెనంటూ మోసపుచ్చిన
గాంది టోపీ మాటనమ్మి
సారదాగీ ఒల్లు పెంచిన
ఎద్దుపైనే ముద్దరేసీ
అదికారమంతా కట్టబెట్టి
ఉత్త సేతుల నువ్వు నిలిశావు!
ఎన్నడైనా దరికి పిలిశాడా
మన మంత్రిగారూ-
కూలిపోయిన గుడిసె గోడలు
లేవనెత్తే దారి సూప్యాడా??
సంటిదానికి పాలసుక్కేదీ?
సదువుకొంటానంటు యేడ్చే

పిల్లగాడికి పలక ముక్కేదీ?
ఈడొచ్చిన పిల్లదానికి
సిగ్గు దామగ కట్ట బట్టేదీ?
పొద్దు పొద్దూ బజారెక్కి
అమ్మ ఆలిని తిట్టిపోసే
అప్పు ఎప్పుడు తీరిపొయ్యేను?
ఈరయ్యా మాలీ.
శాకిరంతా ఎవరుదోశారు?
నిన్నెందుకిట్టా
కరువు రాచ్చసిముందు తోశారు??
గూడసినిగిన సొక్క నవ్వింది?
ఈరయ్య మాలీ...
ఆరిపోయిన సుట్ట యేడ్సింది?
సూర్య శంద్రులు నిన్నుమరిశారు
ఈరయ్య మాలీ
లోపమెక్కడ దాగివుందయ్యా?

తండ్రితాతలు మన్నుగలిసిరి
తరాలిట్టే జరిగిపోయెను
కంటినీరే కాలవయ్యిందా
ఈరయ్య మాలీ
శాకిరంతా మన్ను గలిసిందా?

ఎందుకిట్టా జరుగుతుండదిరా?
కాయకష్టం నువ్వు చేస్తివి!
కాయలేమో వారు మేసిరి!
పాలనెందుకు మూగబోయింది?
నాయమెందుకు నోరుమూసింది?
ఈరయ్యా మాలీ...

కిటుకు ఏదో తెలుసుకున్నావా?
మోసమెక్కడో పట్టిసూశావా?
బూమిసుందా? ఇత్తునుందా?
నీళ్లనుందా? గాలినుందా??
సంగతేమో ఆలోసించావా?
బూమికే బాగానె వుండదిగా
సెట్టు బాగనె పండుతుండదిగా
పంట మిద్దెలో మూల్గుతుండదిగా
సేయిసాచి పిలుత్తుండదిగా!

ఎవరు యిట్టా గొంతుకోశారు?
ఈరయ్యా మాలీ
నీ గుండెలోన బాకు దూశారు?
దర్మమెక్కడ దాగివుండదిరా?
నీపిలుపు దానికి అందకుండదిరా!
ఎవరు మద్దెన గోడలెత్తారు?
నిన్ను దానికి ఎడం జేశారు??

ఓట్లు గుంజిన నేతలెక్కడరా?
గద్దెనెక్కిన పెబువులెక్కడరా?
నీ బతుకుదిద్దే మార్గమెక్కడరా?
పెజారాజ్జెం వుత్త మాటేనా?
పొగరుగిత్తల రాజ్జెమయ్యిందా??

మంచికిక్కడ సోటులేదయ్యా
ఈరయ్యా మాలీ
కసాయోడికి జాలిలేదయ్యా
పిచ్చి వూహాలు కట్టిపెట్టయ్యా
నీది

పడగ కిందా కప్పబతుకయ్యా
ఈరయ్య మాలీ-
సావెగానీ బతుకు లేదయ్యా:

ఎందుకోసం నువ్వుసావాలి?
నిను సంపెటోడు ఏల బతకాలి?
రోజుసచ్చే సావుకన్నాను
బతుక్కోసం సత్తెగొప్పేను!

యాపకాయలు తియ్యగుండవురా
ఈరయ్య మాలీ...
కాకిగూట్లో కోయిలుండదురా
నిజం నువ్వు తెలుసుకోవాలి
ఆజం బలిసిన తలను కొట్టాలి
బూమి నీకే సొంతమవ్వాలి
పంట అప్పుడె సేతికందేను
ఈరయ్య మాలీ-
అందుకే నువు నడుంగట్టాలి!!

ఆయిల్ బాంబు!

అమెరికాకు రెండు నాల్కలున్నయి
రష్యా రెండు తలల పాము
అరబ్బుల పెట్రోల్‌కు మాత్రం ఒక్కటే నాలుక
అది సామ్రాజ్య వాదం మీద
మంటలను కక్కుతున్నది.
'అయిల్ బాంబు' దెబ్బకు అణుబాంబు అదిరిపోయింది
నిజమే కాని, అరబ్బులారా, ప్రజలు
నిజమైన ఆయుధాలు
ఒప్పందాల అవమానాల ప్రతీకారాలు
ప్రజా కసివాడితో చెల్లించండి.

పోరుగల్లీ

- నిజం

పోరుగల్లీ చేర బిలిచెను
ఊరు వాడా కదిలి రారండీ
వాటముగ బందూకు పట్టీ
నాటుబాంబును చేతబూనండీ
శ్రమజీవులారా!
ఎర్రకోటకు పయనమవ్వండీ!
వో అన్నలారా!
వోటమెరుగని శక్తి మీదండీ!

ఊళ్ళకూళ్ళను దోచుకోను
పార్లమెంటుకు పరుగులెట్టే
వోటు పెట్టెల కాటుగాళ్ళను
నేటితో బుగ్గత్తి పొయ్యండీ
శ్రమజీవులారా!
చేయి చేయీ కలిపినడవండీ
మా అన్నలారా
మనిషి మనిషిని కూర్చి పేర్చండీ!

చేను నాటీ చెమట పోసీ
సాగుచేసిన దేశ సంపద
తేరగా తినమరిగి కులికే
పోరగాళ్ళను తుడిచిపెట్టండీ
శ్రమజీవులారా!
ఎర్ర భీభత్సాలు చూపండి
వో అన్నలారా!
కండ బలిమిని చూపి కదలండీ!

కులంగాడీ మలంమెక్కే
కుటిల బుద్ధుల కుత్సితాలను
చీల్చి చెండీ ముందు నడవండీ
శ్రమజీవులారా!
మతం మత్తును ఖతం చెయ్యండీ
మా అన్నలారా
దేశహద్దులు చెరిపివెయ్యండీ

పోరులో నష్టాలు వచ్చుట
సూర్యచంద్రుల వంటి సత్యం
నష్టకష్టాల్ సాకు చెప్పి
వెన్నుచూపే వదరుబోతుల
కారుకూతలు నమ్మబోకండీ
శ్రమజీవులారా!
రివిజనిజమును ముట్టుబెట్టండీ!
మా అన్నలారా!
జయంమనదే తెలిసిసాగండీ!

షడ్యంత్రము

షడ్యంత్రం పన్నింది ఇందిరమ్మ
అ. రా. కా. సులంతా సమైక్యవాద దేవతలయ్యారు
పొగాకు యీసెలో తాయెత్తు కట్టుకున్న
పోకిరిగాడు 'షూర్ మార్ ఖాన్' అని
అయినవాడు గుండెమీద చెయ్యేసుకుంటే
అవనివాని గుండెలు గుబుల్లొకన్నవి
శ్రీకాకుళ నిర్మల సత్యాల ఎర్రని చిరునవ్వులు
తెలంగాణలో కూడ
కొడవళ్ళ పదునెక్కి వెంగళప్పను వెక్కిరించినవి.

ఎదురు తిరిగేనం

జీవన్

చెట్టు చేమలు నరికి
గుట్టలన్నీ మోసి
దుక్కులన్నీ దున్ని
మొక్కలెన్నో నాటి
రెక్కలిరగా నేను
కష్టించి పనిజేస్తే
     కడుపు నిండా తిండి లేదాయెరా నాకు
     కంటి నిండా కునుకు కరువాయెరా.

గోర్కాళ్ళు కూయంగ
దొరోళ్ళ పనికెళ్ళి
ఎద్దులా నేనేమొ
పొద్దెల్ల పనిజేసి
డొక్క మాడీ నేను
ఇంటికీ తిరిగొస్తె   ॥కడు॥

ఎండనక వానక
ఏడాది పొడుగూత
నడ్డి యిరగా నేను
గొడ్డల్లె పనిజేస్తె
పారైన పట్టని
దొరోడు గట్టిగా
పంటంత యింటికి చేర్చిండురా
నాకు
తిండికైనా గింజ లేదాయెరా   ॥కడు॥

కండలన్నీ కరుగ
రక్తమంతా తరుగ

చెమటంత ఒడిసినే
పండించినా పంట
తెల్ల బట్టాలోడు
సల్లంగ కాజేసె ॥కడు॥
కొంప సేరీ సూడ
గంజి నీల్లూ లేవు
ఇల్లాలి గుండెల్లో
గుబులు గూడూ కట్టె
జరమొచ్చి సంటోడు
మంచాన పడివుంటె
జావగాసీ పోయ లేదాయెరా
నేనుండి ఎవరినీ ఉద్దరించేనురా? ॥కడు॥
పదేళ్ళ నా కొడుకు
పల్కా బల్పం బట్టి
బడికెల్లి నేనేమొ
సదువు కుంటానంటె
బడికెల్లితే నీకు
బువ్వెట్ల వస్తదని
దొరోల్ల పనికేమొ
ఎల్లగొట్టినాను ॥కడు॥
ఎంత కాలము నేను
తిండి కల్లాడేను?
ఎంత కాలము నేను
ఇట్ల పడుండేను?
పంతులెప్పుడొ సెప్పె
ఇంత కాలము నాకు
సెవి కెక్కదాయెనూ
ఒక్కటయ్యా మనము
ఎదురు తిరిగితేను
రాజ్యమూ మనకనీ
దోపిడీ వుండదనీ ॥కడు॥

నా అన్న కార్మికుడు నాకు తోడున్నాడు.
నా ఓట్లు పేదోల్లు కదిలి పోరాడుతునుౘ
ఎర్రజండా కింద - ఏకమయ్యీ మనము
దోపిడీ రాజ్యాన్ని దొంసమూ సేద్దాము
కడుపు నిండా తిండి వుంటుందిరా అపుడు
కంటి నిండా కునుకు వుంటాదిరా.

మంట పండుతుంది

దేవీప్రియ

నేను
చిందిస్తున్న చెమట
పెట్టుబడి భూముల్లో యింకిపోతుంటే
నా
రక్తమాంసాలు
లగ్జరీ ఆవరణలో
కరెన్సీ క్రోటన్స్ పెరగడానికి
ఎరువుగా ఉపయోగపడుతుంటే
మరి
నా చెమట పెట్రోలై మండక
మండి ఖండఖండాంతరాలూ నిండక
నిండి దేశదేశాలలో విప్లవాలు
విప్లవాలలో గెరిల్లాలు
గెరిల్లాల చేతుల్లో హేండ్‌గ్రెనేడ్ల సూర్యుళ్ల
పండక
తప్పుతుందా?
ఊహూఁ.

ముసలి నక్కలు ఏలుతున్న దేశంలో....

నిఖిల్

ముసలినక్కలు ఏలుతున్న దేశంలో
మైడియర్ ప్రధాన మంత్రి –
'యువకులంతా ఎక్కడున్నారు?'
యాభై దాటిన మీ అందరి వయస్సులో
వయస్సును మించిన మీ దోపిడి మనస్సుతో
ఈ దేశం పాతికేళ్ల యౌవనంతో
ఎలా ఉరకలు వేస్తుంది చెప్పు?

నీ పాలనకు లొంగిన
యువకులను బ్రాందీ విస్కీలు తాగే పసిపాపల్లా
చెట్టాపట్టా లేసుకుంటూ చెమ్మచెక్కలాడీ
సినిమా ఉపజీవుల్లా తయారు చేస్తున్న
సర్కారీ సబ్సిడీల తుక్కు సంస్కృతిలో
ఈ తరం ప్రతినిధులు ఎక్కడున్నారు
చెప్పు డియర్ ప్రధాన మంత్రి?

జాతి సొంతం కోసం రక్తం చిందించి
ఈనాడు మీ స్వార్థాల బోనులో
చిక్కిన నిప్పురవ్వల్లాంటి నా సోదరులు
ఎక్కడున్నారు చెప్పు 'మదర్ ఇండియా?'

మీ తరం ముసలిదై
జారిపోయిన యౌవ్వనాలను
జుర్రుకోవాలనే పందుల వాంఛతో

విచ్చలవిడిగా గంతులేస్తున్న నీ సహచరులు,
విప్లవతరాన్ని కాయకల్ప చికిత్సకోసం
టానిక్‌లా వాడుకుంటున్న
జాతి 'పితలు' — జాతి 'మాత '!


రాజులు—పాదుషాలు—వలసపాలకులు
ఏనాడో కట్టి ఇచ్చిన బంధిఖానాలలో
తమ బిడ్డల్ని నరాల కోతగా
కసితో-పెత్తందారి పైత్యంతో
మీరు రోజూ నిలువునా నంజుకుంటున్నా
ఈ తరం వీరులు సూర్యుల్లా రోజూ
చిరునవ్వులు మెరిపిస్తున్నారనే—
సంగతి మీకందరికి తెలుసు!

డియర్ ప్రధాన మంత్రి
నీకు తెలిసి కూడా
చెప్పడానికి సిగ్గుపడుతున్న
నీలోని మనిషి ముందు మాత్రం
సత్యాన్ని కప్పిపుచ్చే యత్నం
ఏనాటికి సాధ్యంకాని ధండుగపనీని!!

ఒక్కసారి సూటిగా
ఈ తూరుపుతరం కళ్ళలోకి చూసి చెప్పు
ఈ దేశం అసలు ఊపిరి
ఎక్కడ ఆడుతుందో
నీ గుండెను తాకి మరీ చెప్పు
ఈ జాతి విప్లవ ప్రతినిధులు
ఈనాటి కలల్ని నిజం చేసేవాళ్లు
ఎక్కడో లేరు

నీ దేశం అడవుల్లో ఏకలవ్యుల్లా
విప్లవ సాధన చేస్తున్నారు.
నయవంచనచేసే ద్రోణాచార్యులనుపాతిపెడుతూ
నీ చుట్టూ శ్రామికులు
శ్రామికుల మిత్రులు -
పోరాటాన్నే ఊపిరిగా పిలుస్తున్నారు.

పెరిగిన ధరలు తగ్గించమంటే
రోజూ బుల్లెట్లు తినిపిస్తున్నాయి చట్టాలు.
ఈనాడు చెలరేగుతున్న విప్లవం
బంధిఖానాల్లో- అడవుల్లో వుందని సంబరపడినా
వయస్సు తిరిగిన పాలనలో
కిరాయి కాపలా ఆత్మవిశ్వాసంతో
కాలం గడిపే కామందుల చేతులనరికే
కోటికోట్ల శ్రామికుల చేతులే
ముసలి నక్కల రాజ్యాన్ని
పూడ్చి పెడతాయని మరచిపోవద్దు.



ఉప్పెన

(గత సంచిక తరువాయి)

17

హాన్ పట్టుబడిన సంగతి వూరంతటినీ తట్టి లేపింది. పదిహేను రోజుల నుంచి జనం గ్రూపు మీటింగుల్లో పాల్గొంటూ, నిర్భయంగా, రాజకీయ చైతన్యంతో పోరాటాన్ని ముందుకు సాగించేందుకు సంసిద్ధులయేరు. ఊరంతా వెలుగు నింపడానికన్నట్టు ఇంకా ఇంకా యాక్టివిస్టులు తయారయేరు. హాన్ 'వూ'ని చంపబోవడం అతను చేసిన లెక్కలేనన్ని దుర్మార్గాల్లో మరోటి. కాని ఇప్పుడు జనం మేల్కొన్నారు. వాళ్ళల్లో హాన్ మీద అసహ్యం, కసి, ద్వేషం రగులుకోడానికి ఆ దుర్మార్గంచాలు.

ఎటు చూసినా మంటలే. చైనా అభివృద్ధిని నిరోధించిన భూస్వామ్య విధానం, మరోకొత్త సమాజానికి తావుయివ్వని భూస్వామ్య విధానం ఆనవాలు లేకుండా మండిపోతోంది. ఎటు చూసినా మంటలే-ఆకాశాన్నంటే మంటలు-ఇంకా పైపైకి లేచే మంటలు. తరతరాలుగా రైతాంగం అనుభవిస్తున్న అన్యాయాలే ఈ మంటలకి ఇంధనం.

హాన్ పట్టుబడిన సాయంత్రం భూసంస్కరణ కార్యకర్తలు, యాక్టివిస్టులు చావో ఇంటివెనక తోటలో కలుసుకున్నారు- పెద్ద మీటింగు గురించి చర్చించడానికి. వాళ్ళంతా బీరపందిరికింద కూచున్నారు. సంజెకాంతుల్లో పచ్చని ఆకులమధ్య తెల్లటి బీరపూలు చాలా అందంగావున్నాయి. సియావో మీటింగు గురించి యాక్టివిస్టుల వుద్దేశం చెప్పమన్నాడు.

చర్చలో అందరూ పాల్గొనడంతో మీటింగు బాగుంది. కాని ఒకేసారి అందరూ కలిసి మాట్లాడ్డంతో మాటలకన్నా రొదే వినిపించేది. అధ్యక్షుడు చావో మీటింగుని మళ్ళీ అదుపులోకి తెచ్చేడు.

'అలాగ అంతా ఒక్కపాలే మాటాడతారేటి? ఒకలెనక ఒకలు సెప్పండి.'

"ఈ మారు హాన్‌ని కట్టిపడెయ్యాల. లేకుంటే ఈ మారుకూడా మనం ఆడితో లాలూచి పడిపోయే మనుకుంటారు జనం" అన్నాడు పాయి.

"ఓల్డ్ సన్, ఇప్పుడు నీ వంతు" అన్నాడు చావో.

"హాన్ యింటో లంజల్ని కూడా కట్టిపడెయ్యాల. మన ఆడోలకి అల్లని వొగ్గెయ్యాల. ఆడోలకో మీటింగు. మగాలకో మీటింగు."

"అది బాగునేదు" అన్నాడు చాంగ్ చింగ్ సియాంగ్. "జనాన్ని రెండు చేస్తే గొడవైపోతాది. ముందుగా హాన్‌గాడి పని పట్టాల. సెట్టు మొదలు నరికితే కొమ్మలు, రెమ్మలు ఎంచేవు?"

"పాయి, నువ్వు చుట్టూరా శానా మంది గార్డుల్ని ఎట్టాల. దాని సంగతి గట్టిగా సూడాల. ఒక్కొక్కల్లనే హాన ముందుకి పంపాల. సంగతేంటో అల్లు బాగా సెప్పాలి. హాన్ ముందు ఆలు నుంచునేందుకు జాగా వుంచాల" అని కువో వివరించేడు.

"అంతా సిన్నగానే సెప్పాల. ఆడి దురమాంరగాలన్నీ సెప్పుకు పోతే వోరాలకి వోరాలే సాలవు" అన్నాడు పెద్దలీ.

"లీ, నువ్ కూడా జాగర్తగా వుండాల. హాన్‌గాడి తొత్తుల్ని రాని వ్వకు" అని సూచించేడు పాయి.

"ఈ మారు ఎవరేనా ఒచ్చినా అలని అక్కడికక్కడే సితక బాదెయ్యాల. నీకు మాంవు సాయంవుంటాం"అని జాలారి చూ భరోసా యిచ్చేడు.

పాయి కొంచెమాగి "హాన్‌ని బాదొచ్చా?" అన్నాడు, సంకోచిస్తూ.

"నిన్ను ఆడుగాని కొట్టేడా?"

"కొట్టేడనే సెప్పొచ్చు"

"అలాగైతే అడు సేసిందే సెయ్యి" అన్నాడు చావో నవ్వుతూ-

"పొన్ను గర్ర హాన్ కాడికి రేపు అందరూ కర్రలు తెచ్చుకోండి. అడు సేసిందే మనవూఁ సేద్దాం"

సియావో ని సంప్రదించేక చావో, "ఇప్పటికి మీటింగైపోనాది. రేపు పెద్ద మీటింగు. సద్ది తినీసి మీటింగుకి బేగిరండి" అన్నాడు.

"రేపా? ఇయ్యాల రేతిరినే ఎట్టండి మీటింగు" అన్నాడు చాంగ్.

"ఇప్పుడు గ్రూపుల మీటింగుంటాది. జనం రడీ గుండాలిగదా? రేపటితో హాన్‌గాడి ఆట కట్టు." అని, చావో "సియావో బాబూ, నువ్ గాని మాకేమైనా సెప్తావా?" అన్నాడు.

"మీరంతా మంచి సలహాలిచ్చేరు. మేమిప్పుడు స్కూలుకి వెళ్ళి అన్నీ ఆలోచిస్తాం. రేపటికి అధ్యక్షుడు కావాలో లేదో చూడాలి."

ఈ మీటింగైపోగానే యాక్టివిస్టులు తమ చిన్న గ్రూపులతో మీటింగులు జరిపేరు. కొన్ని గ్రూపులు చీకటి పడగానే ఇళ్ళకి వెళ్ళిపోయేయి. అందరూ కర్రలు రడీగా వుంచుకున్నారు. కొన్ని గ్రూపులు అర్ధరాత్రిదాకా చర్చించుకుంటూనే వున్నాయి. అందరినీ సమీకరించుకోవడంవల్ల, జనానికి నమ్మకం కుదరడంవల్ల, చర్చలవల్ల జనంలో మునుపటి భయం తగ్గింది.

ఓల్డ్ సన్ ఇప్పుడు గ్రూపు లీడరు. అతనిలోనే పెద్ద మార్పు వచ్చింది. ఇప్పుడు 'యాక్టివిస్టుగా వుండన'నడంలేదు. బళ్ళవాళ్ళనేగాక పేద కుర్రాళ్ళను కూడా కూడగడుతున్నాడు. అతని వాగ్ధాటి ఎప్పటిలాగే వుంది.

కొత్త పదజాలంతో తన గ్రూపుకి ఒక చిన్న వుపన్యాసం యిచ్చేడు :

"మనందరం యాక్టివిస్టులం. యాక్టివిస్టులకి బయ్యముండదు. అల్లు ఎన్ని 'అడ్డంకు'లున్నా ముందుకు 'చొచ్చుకు'పోవాల. నేపోతే జనాన్ని 'సమీకరించుకోడం' ఎలాగ? మరి నానన్నది రైటా, కాదా? మీరే సెప్పండి."

"రైటే"నని అతని గ్రూపు సభ్యులందరు ఒప్పుకున్నారు.

"మనందరం ఇప్పుడు 'విప్లవ పంథా'లో నడుస్తుండాం. అయితే ఏటి, విప్లవం వచ్చేస్తుంటే కూడా మేకాల్ని చూసీ, తోడేల్లని చూసీ బెదిరిపోతాంవేటి? అసలా 'దృక్పధం' ఏటి?"

అతని ధోరణివల్ల అతని గ్రూపు సభ్యులు మీటింగులో మాట్లాడ్డానికి సిద్ధపడ్డారు. ప్రజలకి, హాన్‌కి మధ్య యిది నాలుగో పోరాటం.

మర్నాడుదయం నీలాకాశం నిర్మలంగావుంది. నేలంతా పొడిపొడిగా వుంది. రంగు రంగుల చేలు గాలికి అటూ ఇటూ వూగుతున్నాయి. మొక్క జొన్న పచ్చగా వుంది. ఎర్ర గోధుమ దుబ్బుల మీద తెల్లపూలు మంచు చిల కరించినట్టుగా వున్నాయి. మొక్కజొన్న చేలో కొన్ని పొత్తులమీద ఊదా రంగు పీచు వేలాడుతోంది. మరికొన్ని పొత్తులే వెయ్యలేదు. దూరాన్నుంచి చిక్కుడు ఆకులు పసుపుపచ్చ పచ్చల్లా కనబడుతున్నాయి. రైతుల గుడిసెల ముందు మిరప మొక్కలు ఎర్రటి పళ్ళతో వూగులాడుతున్నాయి. అందువల్ల చేలలాగానే ఇళ్ళుకూడా పచ్చ పచ్చగా వున్నాయి.

జనం పంట బాగున్నందుకూ, హాన్‌ని గెలిచినందుకూ కూడా సంతో షిస్తున్నారు.

తెల్లవారుతుండగానే జనం గుంపులు గుంపులుగా కర్రలు వూపు కుంటూ హాన్ యింటివేపు నడిచేరు. బాగా తెల్లవారేసరికి ఇంటిముందు ఖాళీ జాగా అంతా కిక్కిరిసి పోయింది. గేటు పక్కనుండే చిన్న ఇంటి మీద, గోడలమీద, కిటికీలమీద, ఇంటి కప్పుమీద ఎక్కేరు

పిల్లలు, ఆడవాళ్ళు కొత్తగా కట్టిన పాట పాడుతున్నారు :

"కంటికి కన్ను
పంటికి పన్ను
రక్తానికి రక్తం
దెబ్బకి దెబ్బ తీస్తాం!

ఇక నీ ఆటలు సాగవు గండా!
పార్టీ వున్నది మా అండ!

ఆరో నంబరు హాన్!
ఆరో నంబరు హాన్!
దెబ్బకి దెబ్బ తీస్తాం!
రక్తానికి రక్తం చిందిస్తాం!"

మొదట్లో పిల్లలు, ఆడవాళ్ళు మాత్రమే పాడేరు. తర్వాత కుర్రాళ్ళు కూడా అందుకున్నారు. అలాఅలా గొంతులు కలిపేరు - ఓల్డ్‌సన్ కూడా

తర్వాత డప్పులందుకున్నాయి. జాలారి చూపెద్ద డప్పు వాయించేడు. మిగతావాళ్ళు తాళాలు వాయించేరు.

"వచ్చేస్తున్నాడు, వచ్చేస్తున్నాడు." అందరూ గేటువేపు చూసేరు అందరికీ బైటికి వెళ్ళి చూడాలని వుందిగాని, తొక్కిసలాటవల్ల ఎవరూ కదల్లేక పోయేరు.

నలుగురు ప్రజా సైనికులు హాన్‌ని తీసుకొచ్చేరు. దారి పొడుగూతా ప్రజా సైనికులు నిల్చున్నారు. హాన్ ఇంటి బురుజులమీద కూడా కాపలా వున్నారు. ప్రజాబలం కళ్ళెదటే కనిపిస్తుంటే హడలి పోయేడు హాన్.

"వస్తున్నాడు, వస్తున్నాడు" అంటూ పిల్లలు అతని ముందు పరుగెడుతున్నారు

తుపాకి తగిలించుకుని పాయి అటు యిటు తిరుగుతున్నాడు. బురుజుల మీద వున్నవాళ్ళని చుట్టూ చూస్తూండమని చెప్పేడు. పొడుగుమెడ హాన్ గాని, లీచింగ్— షాన్‌గాని హాన్‌ని రక్షించేందుకు హాన్ తమ్ముడినిగాని, బందిపోట్లనిగాని తీసుకురావచ్చునని అనుమానం.

ఈ మధ్య పని, ఆరాటం ఎక్కువై పాయి బాగా చిక్కిపోయేడు. అతని కిప్పుడు బద్ధకం ఏ మాత్రం వుండడంలేదు. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే వున్నాడు. మీటింగుకి ముందు రాత్రి అతను ఇంటికి చాలా ఆలస్యంగా వెళ్ళేడు. అతని భార్య కళ్ళు నలుపుకుంటూ లేచి కూచుంది.

"కుండలో అంబలి వున్నాది. కూసింత తెచ్చేదా?"

"నాకిప్పుడేం ఒద్దు. రేపు హాన్‌గాడివని వడతారు. నువ్ కూడా రావాల," అన్నాడు పాయి, కళ్ళు మూతలు పడిపోతుంటే.

"ఆడదేటి సేస్తాదక్కడ?"

"నీ కొడుకు సావుమీద కసి తీర్చుకోవేటి?" అని గురకపెట్టేడు పాయి.

"నానంత పెద్ద మీటింగులో మాటాడాల్నా? నా గొంతు ఆర్చుకుపోతాది బాబూ" అంది పాయి భార్య.

కాని పాయి జవాబివ్వలేదు— నిద్రవల్ల. పాయి భార్యకి కొడుకుచావు సంగతంతా గుర్తొచ్చింది. తెల్లవారుతూండగానే పాయిని లేపి, తనుకూడా మీటింగుకి బయల్దేరింది. మరి తనుకూడా ఆ వుత్సాహంలో పాలు పంచుకోవద్దూ! అక్కడ గోడవారగా చాలా మంది ఆడవాళ్లు నించున్నారు. ఆవిడ చావో భార్యతోనూ, తీన్ తాత గుడ్డి భార్యతోనూ పొత్తు కలిపింది.

హాన్ వేదిక చేరగానే అన్ని వైపులనుంచీ కేకలేసేరు.

చావో యీల వూది యిలా అన్నాడు:

“అందరూ నెమ్మదిగా వుండాల. మధ్యలో చిన్న చిన్న మీటింగులు ఒద్దు. ఉన్న జాగాలోనే సదరుకోండి. ఇయ్యాల యీ బుగత హాన్ ఫెంగ్-చీ మీద మీటింగు. ఎవరి గోడు అలు సెప్పుకుని దెబ్బకు దెబ్బ తియ్యాల.”

ఓ కుర్రాడు ఓ చేత్తో దుడ్డుకర్ర, మరోచేత్తో ఈటె పుచ్చుకొని హాన్ మీదికొచ్చేడు. అతను చాంగ్ చింగ్-సియాంగ్.

“ఈ అరో నంబర్ హాన్‌గాడు నాకుఎప్పుడూ వగాడే. ఓ ఏడాదంతా* ఈడి కాడ గొడ్డు చాకిరి చేసినా నా పైసలు నాకు యియ్యనేదు. అది సాలక నన్ను లేబరుకేంపుకి పంపీసినాడు. నాను తప్పించుకుంతే మా యమ్మని బొక్కలోకి తోయించీసినాడు. అడనే అది నచ్చిపోనాది. ఇప్పుడు యీన్ని కొత్తమంతారా, నేదా?”

“కానియ్”

“అడు నచ్చేట్టు బాదు!” “నచ్చేట్టు బాదు!”

అన్ని వేపులా కేకలు లేచేయి. జనం కర్రలు, ఈటెలతో ముందుకురికేరు. సైనికులు వాళ్ళని ఆపడానికి ఈటెలు అడ్డంగా పట్టుకు నిల్చున్నారు. కాని అవి ఆ ప్రవాహాన్ని అడ్డలేకపోయేయి. హాన్‌కి అంతా అర్థమైపోయింది. చాంగ్ కర్రెత్తగానే కుప్పకూలిపోయేడు. వాడి ఎత్తు చావోకి తెల్సిపోయింది.

“తొత్తుకొడకా, కర్ర తగలకుండానే పడిపోతావురా?”

ఈమారు వందలాది కర్రలు లేచేయి. ఇక దీన్ని ఎవరూ ఆపలేకపోయేరు. కర్రలు పడాల్సిన చోటకాక పక్కవాళ్ళ వీపులమీద, తలల మీద పడసాగేయి. అలాగే ఓల్డ్ నన్ చింకిటోపి పడిపోయి తొక్కిసలాటలో నలిగిపోయింది. దాన్ని అందుకోవాలని చెయ్యిజాపేసరికి చేతిమీద ఓ దెబ్బ పడింది. ఓ ముసలావిడ కాలుమీద కూడా దెబ్బ పడిందిగాని ఆవిడ ఏఁవీ అనలేదు. హాన్‌మీద వున్న అసహ్యం ముందు ఇది ఎవ్వరికీ పట్టలేదు.

‘అడిని లేవండి. ఇంకెవరైనా ముందుకొచ్చి సెప్పండి’అని అరిచేడుచావో.

---

* 1941 సంవత్సరం

బట్టతలని ఎవరోపైకి లేపేరు. అతుకుల చొక్కా వేసుకున్న మధ్య వయస్కురాలు హాన్ తలమీద కర్ర ఆడిస్తూ,

“నా కొడుకుని నువ్వే పొట్టన బెట్టుకున్నావురా!” అని అరిచింది.

ఆవిడ కర్ర హాన్ భుజంమీద పడింది. మళ్ళీ కొట్టపోయిందిగాని చేతిలో సత్తువలేక కర్ర లేవలేదు. కర్ర కిందపడేసి, కసి ఎలా తీర్చుకోవాలో తెలీక హాన్ మీద పడి చేతులు కరిచేసింది. కొడుకుని గురించి చెప్పి ఏడ్చేసింది. చాలా మంది ఆడవాళ్ళుకూడా ఏడ్చేరు. ఆవిడ ఓ విధవరాలు. ఆమెకు ఒక్కడే కొడుకు. అతనికి పెళ్ళి చేసింది 1939లో. కోడలి అందంచూసి హాన్ వాళ్ళింటికి రోజూ వెళ్ళేవాడు. కొడుక్కి కోపంవచ్చి ఓ రోజు హాన్ మీదికి కత్తి విసరబోయేడు. “అగరా, నీపని చెప్తాను!” అంటూ పిక్కబలం కొద్దీ పారిపోయేడు హాన్. ఆ రాత్రే హాన్ అతన్ని లేబరు కేంపుకి పంపేసేడు. అక్కడ హాన్ మాటమీద జపానోళ్ళు అతని పీక నొక్కేసేరు. అప్పుడావిడ కోడలిని బలవంతంగా తను వుంచుకున్నాడు. ముఖం మొత్తగానే ఆమెని ముండల కంపెనీకి అమ్మేసేడు.

“నా కొడుకిని యివ్వరా!” కోపం, దుఃఖం కలిసిరాగా మళ్ళీ అరిచింది ఆవిడ.

ఆమె ముందుకి వురకగానే మిగతా వాళ్ళుకూడా ఆమె వెంటే ముందు కొచ్చేరు- ఆడవాళ్ళ భర్తలగురించి, కొడుకుల గురించి, మగవాళ్ళు తండ్రుల కోసం, అన్నదమ్ములకోసం. తిట్లు, ఏడుపు కలిసి వినిపిస్తున్నాయి. చిన్నవాంగ్ కళ్ళు తుడుచుకున్నాడు. సియావో ఎప్పటి కప్పుడు లియూ- షెంగ్ ని హాన్ చేసిన నేరాలు రాసుకొమ్మన్నాడు.

నేరం మీద నేరం బయటపడుతున్నాయి, సాయంత్రానికల్లా లియూ- షెంగ్ పుస్తకంలో రికార్డయినవి పదిహేడు హత్యలు- కువో తండ్రి చలికి గడ్డకట్టుకు పోవడం, చావో కూతురు తిండిలేక చచ్చిపోవడం, తీన్ తాత కూతురు దెబ్బలకి చచ్చిపోవడంతోసహా పదిహేడు హత్యలు! నలభై ముగ్గురు పడుచుల్ని మానభంగం చేసి తనకీ తన కొడుక్కీ ముఖం మొత్తగానే కంపెనీలకి అమ్మేసేడు. ఈ లెక్కలు తేలగానే జనాన్ని ఆపడం ఎవరితరమూ కాలేదు. హాన్ మీద వందలాది కర్రలు లేచిపడ్డాయి.

“సచ్చేదాకా బాదండి, సంపండి” అని అరిచేరెవరో.

“ఆడి సావు యియ్యాలే మూడాల” గర్జించేరు మరెవరో.

"పేనానికి పేసం తియ్యాల!"

"ఆడిని ముక్కలు ముక్కలు సేస్తేగాని నాకసి తీరదు!" అని ఒణికే గొంతుతో అరిచింది తీన్ తాత భార్య.

హాన్‌ని కొట్టేందుకు ఆమెని ముందుకు తీసుకురావాలని చూసింది పాయి భార్య. కాని తొక్కిసలాటలో యిద్దరూ పడిపోయేరు. పాయి భార్య వెంటనే లేచి నించుని, ఆ ముసిలావిడని కూడా లేపి, జాగ్రత్తగా పక్కకి తీసుకు పోయింది.

ఇంకా నేరారోపణలు సాగుతూనే వున్నాయి. హాన్ ఫెంగ్-చీ-భూస్వామి, దగాకోరు, కిరాతకుడు- చాటు మాటుగా చేసిన ఎన్నో హత్యలు కాక పదిహేడు హత్యలు తేలేయి. బీదా బిక్కీ అందరిచేత వెట్టి చాకిరి చేయించుకున్నాడు. లీ చెన్-చియాంగ్ లాంటి అతని తొత్తులు తప్ప కౌలుకి తీసుకున్న మిగతా రైతులు అతను చెప్పిన పెద్ద మొత్తాలు కట్టలేక ఏడాది చివర్న దిగజారి పోయేవారు. అప్పుడు అతనికి వెట్టి చాకిరీ చెయ్యడమేగాక, తమ దగ్గరున్న గింజలు, మేత, గుర్రాలు అన్నీ హాన్‌కి ధారాదత్తం చేసేవారు. హాన్ అతని కూలీలకి ఎప్పుడూ జీతాలిచ్చిన పాపాన పోలేదు. ఓ ఏడాది పనిచేసిన తర్వాత వాళ్ళకి రెండు మూడు కిలోల పంది మాంసం దొరికితేనే గొప్ప. తనకి ఇష్టంలేనివాళ్ళు ఎవరైనావుంటే తన ఇంట్లోనేవున్న జపాన్ ఆఫీసరు మొరి టూ తారో సాయంతో వాళ్ళని లేబరు కేంపులకి పంపేవాడు. అలా పోయిన వారిలో చాలా తక్కువమంది తిరిగొచ్చేరు. పేదలచేత బావి తవ్వించుకున్నాడుగాని, వూరికే చాకిరి చేయనిదే వాళ్ళకా నీరుకూడా దక్కేదికాదు. అతని కూరగాయల తోటలో పందులు ఓ గడ్డిపరక తొక్కితే చాలు, వాటి యజమానులను బొక్కలోకి తోయించీవోడు. అతనికున్న రెండు వేల ఎకరాల్లోను అతనికి పిత్రార్జితం రెండు వందల ఎకరాలు మాత్రమే. మిగతాదంతా అతను అన్యాయంగా సంపాదించిందే.

జనానికి ఈ నేరారోపణలమీద వుత్సాహంలేదు. "మాకదంతా ఎరికే ఆడు సేసిందంతా సెరుపే. ఆడొక్క మంచిపనన్నా సెయ్యలా. ఇప్పుడు మాం ఇల్లకి పోం. ఇక్కడే వుంటాం. రేతిరి కూడు కూడా తినం. ఇయ్యాల ఆడి సావు మా కల్ల సూడల్సిందే!"

సియావో ఫోన్‌లో జిల్లా కమిటీని సంప్రతించేడు. ఇంతలో లియూ-షెంగ్ జనానికి మరోవిషయం గుర్తుచేసేడు: సియావో షాంటీ అనే చోట

హాన్ తొమ్మండుగురిని చంపించేడు- వాళ్లంతా జపాన్ వ్యతిరేక సైన్యంలోని వాళ్లే. జపాన్ వాళ్లు లొంగి పోయేక యువాన్ మావో వూరిపెద్ద అయేడు హాన్. అప్పుడే పీ-లాయి కిందవున్న కొమింటాంగ్ ప్రభుత్వంలో ముఖ్యుడయేడు. అప్పుడే యునైటెడ్ డెమాక్రాటిక్ పార్టీలోని మనిషిని చంపించేడు.

"మరో పది మంది" అన్నాడు తీన్ తాత. "అయితే ఆడు మొత్తం ఇరవై ఏడు మందిని సంపేడు!"

"కొమింటాంగు బందిపోట్లు నశించాలి!"

"చియాంగ్ కై-షేక్, ఆడి తొత్తులు నశించాలి!" కుడిచెయ్యి పైకి విసురుతూ అరిచేడు చిన్న వాంగ్. అతని వెనకే వెయ్యి గొంతులు లేచేయి.

ఇంతలో సియావో వచ్చి వేదికముందు నించున్నాడు.

"యువాన్ మావో ప్రజలతో జిల్లా కమిటీ ఏకీభవిస్తోంది. హంతకుడి ప్రాణాలు తియ్యాల్సిందే?"

"ప్రజా ప్రభుత్వం వర్ధిల్లాలి" అని ఎవరో అరిచేరు. అతను షాన్‌టుంగ్ జిల్లా నుండి వచ్చేడు. అతనిపేరు హువాయంగ్-సీ. "కమ్యూనిస్టు దళాలు వర్ధిల్లాలి!"

ఆడ, మగ, చిన్నా, పెద్దా అందరూ గొంతుకలిపేరు. చప్పట్లు చరిచేరు ఆకాశం పెద్దగా వురిమినట్టుంది ఆ శబ్దం.

చావో్రపాయి తుపాకులు పుచ్చుకుని హాన్‌ని వూరి తూర్పు గేటు వైపు నడిపించేరు. వాళ్ల వెనకే కువో, పెద్దలీ నడిచేరు. వాళ్ల వెనక జనప్రవాహం. అందరూ నినాదాలిస్తూ, పాటలు పాడుతూ, డప్పులు వాయిస్తూ, బూరలు వూదుతూ ముందుకి నడుస్తున్నారు. తీన్ తాత గుడ్డి భార్య పాయి భార్య సాయంతో నడుస్తోంద.

"మూడేళ్లనించీ యీ రోజుకోసం వేసూ స్తండానమ్మా" అని తీన్ తాత భార్య ఏడ్చింది. "ఇదంతా చైర్మెన్ మావో సలవా, పార్టీ సలవాను ఇప్పటికి నాకసి తీరింది."

18

హాన్ ఇంట్లోని "భూస్వామ్యం" అనే చెట్టు కొట్టేశాక, రైతులు ఇంకా ఎక్కువగా గ్రామ వ్యవహారాల్లో జోక్యం కల్పించుకున్నారు. రైతుసంఘం

మరింత వుత్సాహం పుంజుకుంది. సంఘంలో చేరటానికి చాలా మంది రైతులు భూసంస్కరణ కార్యకర్తల దగ్గరకొచ్చేరు. సియావో వాళ్ళందరిని చావోకి అప్పజెప్పేడు.

చావో కుప్పలు కుప్పలుగా పడివున్న దరఖాస్తుల్ని పరిశీలిస్తున్నాడు. అతనికి భోజనానికికూడా తీరికలేకుండా పగలూ రాత్రీ వచ్చేపోయే జనంతోనే సరిపోతోంది.

"చావో బాబూ, నాను కూడా సంగంలో సేరొచ్చా?" అని అడిగేడు, పెళ్ళాం పోయిన హువాయంగ్-సీ.

"మరో యిద్దరు వత్తాసిస్తే సరి" అన్నాడు చావో.

"సెయిర్‌మన్ బాబూ. నన్ను కూడా మెంబరు సేస్కోండి" అన్నాడు కేకలు కొట్టు చాంగ్ ఫూ-యింగ్.

"ఓహో, అందుకేనేటి యాంగ్‌తో కలిసి భూమి తప్పుడు పంపకం చేసేవు?" అన్నాడు చావో గొంతుమార్చి.

చావో తీరు చూడగానే చాంగ్ చిన్నబుచ్చుకుని బైటికి వెళ్ళిపోయేడు. కాని మళ్ళీ తలుపు దగ్గర ఆగి చావోని బ్రతిమాలుకున్నాడు.

"సెయిర్‌మన్ బాబూ, నాను తప్పొప్పుకుంటాను. మరెప్పుడు అలాటి ఎదవ పనులు సెయ్యను. మరి తర్వాత జేరొచ్చునా?"

"సూద్దాంలే. ఇయాల్టినించీ నువ్ ఎలా మసుల్తావో సూడాల" అంటూ చావో మరే పనిలోనో మునిగి పోయేడు.

చాంగ్ ఇంటికెళ్ళేక తన గుమాస్తాతో "చావో మునుపటి మనిషికాడు. మంచుకో పోలీసోడి కన్నా గోరం!" అన్నాడు.

మధ్య తరగతి రైతు లియూతె-షాన్ కూడా రైతు సంఘం చైర్మన్ దగ్గరికి వచ్చేడు.

"నువ్ నిజంగానే చేరతావా? ఆరో నంబరు హానంటే నీకు బయ్యం నేదేటి?" అని వ్యంగ్యంగా అడిగేడు చావో.

"అలా ఆటపట్టిస్తావేటి బాబూ? సచ్చిన పాంవుకు కూడా జడుసు కుంటావా?"

"రైతు సంఘం సభ్యుడవగానే సరికాదు. ఎండనక వాననక పని

సెయ్యాల కాపలా నించోవలసొస్తే నించోవాల, అటూయిటూ తిరిగి పనులు సేసిపెట్టాల. మరి నీకు సమ్మతమేనా?"

"కాపలా పని నా కొడుకు సేసిపెడతాడు.

"ఏం, నీకాపని నామోషికా?"

"నా కాలొకటి సరిసేదు బాబూ, పట్టేస్తాది. అదీగాక నాకు వయ సొస్తన్నాదికదా"

"మరైతే సంఘంలో ఎందుకు చేరటం?" అని గదమాయించేడు చావో.

ఆ ధాటికి తట్టుకోలేక ఏదో గొణుగుతూ వెళ్ళిపోయాడు లియు తె-షాన్.

హాన్ భూమి కౌలుకి తీసుకునే పెద్దరైతు లీచెన్-చియాంగ్ సంఘానికి ఎనిమిది గుర్రాలిస్తానని కబురంపేడు. తనుకూడా సంఘంలో చేరతానన్నాడు.

"ఈల్లేదు. అదూ ఒద్దు, అది గుర్రాలూ ఒద్దు. అది గుర్రాల్ని తీసు కోవాలో, మానాలో జనం సెప్పాల. నాకు తెలీదు" అని కచ్చితంగా చెప్పేడు చావో.

లీచెన్-చియాంగ్‌కి చావో మీద, రైతు సంఘం మీద ఇంకా కసి పెరిగింది. తనకున్న సంపదంతా పూర్తిగా అనుభవించదల్చుకున్నాడు.

హాన్‌ని చంపేసిన రాత్రి వెన్నెలలేదు. చుక్కలు కూడా మబ్బుల్లో దాక్కున్నాయి. లీ ఇంటి పెరడంతా చీకటిగా వుంది. గదిలో దీపం ఆర్పేసి కొడుకుని తీసుకుని పందుల దొడ్లోకి వెళ్ళేడు. బాగా బలిసిన పందిని తోలు కొచ్చి, మూతి గోనెతో కట్టేసేడు తండ్రి. కొడుకు దాని కాళ్లు తాళ్లతో బిగించేడు. ఇద్దరూ కలసి దాన్ని దక్షిణపు గదిలోకి లాక్కుపోయేరు. ఆఖరి కొడుకు గేటు బయట కాపలా నించున్నాడు. లీ భార్య, కోడలు, మరో ఇద్దరు కొడుకులు కలిసి కిటికీలన్నీ గోనెలతో మూసేసి దీపం వెలిగించేరు. ఇంట్లోవున్న ఏడుగురు కలిసి దాన్ని కోసేసేరు. నెత్తురుబొట్టు కూడా కనపడ కుండా తుడిచేసి, పెద్ద బానలో ఆ రాత్రే ఒండేసేరు. అందరూ పీకల మొయ్యా మెక్కేరు. అంత మాంసం తినేసరికి దాహం ఎక్కువై మంచినీళ్ల కోసం రాత్రంతా లేస్తూనే వున్నారు. మర్నాటికి అందరికీ కడుపులో గడబిడ మొదలు.

ఆ తర్వాత ఆ కుటుంబమంతా బద్ధకస్తులయి పోయేరు. లీ పొద్దెక్కే వరకు కొంగు దిగేవాడుకాదు. గుర్రాలకి మేత వెయ్యడం మానేసేరు.

ఎనిమిది మాంచి గుర్రాలు చిక్కిపోయేయి. పాలు చాలక ఒ గుర్రప్పిల్ల చచ్చిపోయింది.

చావోకి మిగతా పనులెక్కువైనందున ఇంటిపనులు చూడడం మానేసేడు. ఓ రోజు యింటికి తొందరగా రావడంవల్ల భార్య పొయ్యిలోకి కర్రముక్కలు లేవని చెప్పింది. అందుకని మర్నాటి పని కువోకి అప్పజెప్పి చావో కట్టెలు కొట్టేందుకు వుత్తరంవేపు వెళ్ళేడు. ఏటి ఒడ్డున కట్టెలన్నీ పేర్చి, మర్నాడు పొరుగువాళ్ల బండి తెచ్చి కట్టెలు ఇంటికి తీసుకుపోవచ్చనే వుద్దేశంతో ఇంటికెళ్ళేడు. దారిలో లీచెన్-చియాంగ్ పెద్దకొడుకు తగిలేడు.

'చావో మాఁవా, కట్టెలుకొట్టి వచ్చేవా?' అని అడిగేడు నవ్వుతూ.

'అవును, మా అడదాయి ఇన్నాలూ ఇరుగుపొరుగు కాడే అరువు తెచ్చేది. దాని పోరు పడలేక ఎల్లేను' అనుమానమేమీ లేకుండా వెళ్లిపోయేడు చావో.

అర్ధరాత్రివేళ గాలి ఎక్కువగా వుంది. అరుపులు

"మంటలు! అమ్మో మంటలు! ఉత్తరమేపు మంటలు!"

చావో వెంటనే తుపాకి తగిలించుకుని వుత్తరంవేపుకి పరుగెత్తేడు. జనం దూరాన ఎగిసే మంటల్ని చూస్తున్నారు. ఏటిలో మంటల నీడలు పడి ఏరే మండిపోతున్నట్టుగావుంది. బందిపోట్లేమోనని సియావో సెక్షన్ లీడర్ చాంగ్‌ని గార్డులతోసహా గుర్రాలమీద పంపేడు. వాళ్లతోపాటే చావో, కువో కూడా వెళ్ళేరు. కాని అక్కడ ఏ బందిపోటూ లేడు. అదంతా చావో కొట్టిన కట్టెల మంట. కొద్ది సేపట్లోనే అన్నీ మసి అయిపోయేయి. చావోకి మళ్లీ కట్టెలు కొట్టె తీరిక లేకపోయింది. అతని భార్య ఎలాగో సర్దుకుంది.

రైతు సంఘంలో జరిగినట్టుగానే భూసంస్కరణ కార్యకర్తలని కూడా కామందులు విడిచిపెట్టలేదు. పెద్దాచిన్నా అందరూ ఇళ్లు, పొలం ఇచ్చేస్తామంటూ ముందుకొచ్చేరు— ఇప్పుడే "జ్ఞానోదయ" మయిందంటూ అందరికంటె ముందు దుష్టత్రయంలోని తూ ఒచ్చేడు.

సియావోగారూ, మిమ్మల్ని కల్సుకోవాలని చాలా రోజుల్నించి అనుకుంటున్నాను. ఇప్పటికి కుదిరింది. సియావో అతని గుండ్రటి దిబ్బముఖం లోంచి తొంగి చూస్తున్న చిన్న చిన్న ఏనుగు కళ్లని చూస్తున్నాడు.

'నాకు తెల్సిందేవిటంటే'— అంటూ కుదురుగా సియావో ముందున్న బల్లమీద తిష్టవేసేడు తూ. సియావోని తన గాజు కళ్లతో పరికిస్తూ— 'నాకు తెల్సిందేవిటంటే కమ్యూనిస్టోళు పేదోళ్లని, ముసిలోళ్లని ఆదరంగా చూస్తారని. నేను చెయ్యగలిగిందేదో చెయ్యాలి కాబట్టి మీకు కొంత భూమి ఇవ్వాలనుకుంటున్నాను. మీరు దయచేసి నన్ను రైతు సంఘంలో చేర్పించండి' అన్నాడు.

"రైతుసంఘం సంగతంతా చావో, కువో చూస్తున్నారు. మీరు వాళ్ళని కల్సుకోండి"

"వాళ్ళకి రాతకోతలు రావే, వ్యవహారాలన్నీ వాళ్ళేం చూడగలరు?" అన్నాడు తూ తిరస్కారంగా.

"ఏం ఎందుకు చూడలేరు? అయినా రైతు సంఘానికి రాతకోతలు తెల్సి 'మంచుకో' పద్ధతిని ఆలోచించేవాళ్లు అక్కర్లేదు" అన్నాడు సియావో.

తూ ముఖం ఎర్రబడింది. అతనిది నూటికి నూరుపాళ్ళు మంచుకోబుర్ర. నమస్కారంపెట్టి, క్షమాపణ చెప్పుకుంటున్నట్టుగా,

"సరే. సరే. మీరు చెప్పింది రైటే. వాళ్ల దగ్గరకు వెళ్తా"నని లేచేడు.

తూ చావో దగ్గరికి వెళ్లదలచుకోలేదు. చావోని మభ్యపెట్టడం కష్టం కాబట్టి, కువో చిన్నవాడు కాబట్టి కువో దగ్గరకే వెళ్లాలనుకున్నాడు.

కువో, పెద్దపాయి, లీ హాన్ ఇంట్లో అతని సామానంతా పేదలకి పంచుతున్న సంగతి తూకి తెల్సు. దారిలో చింకిగుడ్డల జనమంతా హాన్ ఇంటివేపు వెళ్ళడం చూచేడు.

వాళ్ళంతా గుంపులు గుంపులుగా నవ్వుతూ, తుళ్ళుతూ వెళ్తున్నారు. అందుకే పక్కగా తలొంచుని పోతున్న 'తూ'ని ఎవరూ గమనించలేదు. అక్కడ ఖాళీ జాగాలో రైతు సంఘ సభ్యులు అన్నీ పంచుతున్నారు. జనంలోపలికీ, బైటకీ తిరుగుతున్నారు-పంచుతూనో, సామాను ఎంచుతూనో, సలహాలిస్తూనో. కొందరు తామెన్నడూచూడని రకాల బట్టలు చూస్తూ చర్చించుకుంటున్నారు. తూ అందరినీ గమనిస్తూ పంచిపెట్టే వాళ్ళని, అవి తీసుకునేవాళ్ళని బాగా గుర్తు పెట్టుకున్నాడు.

"వైస్ చైర్మన్ కువో! నన్ను సియావోగారిక్కడికి పంపేరు" అన్నాడు తూ.

"ఏటి? ఏటి కావాలి?" అన్నాడు కువో. ఈమధ్య హాన్ కుటుంబాన్ని తన ఇంటికి ఆహ్వానించింది ఇతనేనని కువోకి తెలుసు.

"పొలం ఇద్దామని వచ్చేను" అని గొణిగేడు తూ.

"అవేటీ ఇక్కడ సూడరు" అంటూ తన పనిలో మునిగి పోయేడతను. తూ నవ్వుకుంటూ 'సరే, అందరూ బిగువుగానే వున్నారు. చూద్దాం, ఎన్నాళ్లు ఇలా వుండగలరో' అనుకున్నాడు.

ఇంటికి వెళ్ళగానే తమ విలువైన వస్తువులన్నీ పాతిపెట్టేరో లేదో కనుక్కున్నాడు తూ. ఆ రాత్రి చీకట్లో ఆ వసువులన్నీ తీసుకెళ్లి ఎక్కడో వున్న తమ బీద చుట్టాల ఇంట్లో దాచిపెట్టేడు. అప్పటికే గుర్రాలన్నీ ఒకే చోట దాయడంవల్ల, ధాన్యం పాతేయడంవల్ల కొంత భయపడ్డాడు. ప్రోనోట్లన్నీ రెండుగాచేసి, రైతుసంఘ సభ్యుల పేర్లుకూడా వాటిలో రాసి, మైనపు గుడ్డలో చుట్టేడు. ఒక కట్ట ఓ చెట్టుకింద దాచి, గుర్తుగా చెట్టుమీద గాటు పెట్టేడు. మరోకట్ట కాంగ్ మీదవున్న చాపకింద దాచేడు.

కాని పగలు మాత్రం రైతుసంఘ సభ్యులు కనిపిస్తే వాళ్లకి వంగి వంగి దణ్ణాలు పెట్టి భూమి ఇచ్చేస్తానంటుండేవాడు. "సూర్యుడి మీద ఒట్టేసి చెప్తున్నా, నా మాట నమ్మండి" అనేవాడు.

ఓ రాత్రి అతను మళ్ళీ కువోని కలిసి "నేను భూమి ఇచ్చేస్తాను. నన్ను సంఘంలో చేర్చుకోండి. విప్లవ బాటలో పేదలతోపాటే నడుస్తాను" అన్నాడు

హాన్ ఇంట్లో కువో, పాయి, పెద్దలీ మరో ఇరవైమంది యాక్టివిస్టులు కలిసి మూడు రాత్రుళ్ళు మూడు పగళ్లు ఏకాదిగా పనిచేసేరు. అందరినీ మూడు క్లాసులు, తొమ్మిది గ్రేడులుగా విభజించేరు. హాన్ గాదెల్లోంచి పుట్లకొద్దీ ధాన్యం తెప్పించేరు- వరి, జొన్న, గోధుమ, చోళ్ళు. ఇదికాక మరో మూడొందలు చిక్కుడు అచ్చులు తెప్పించేరు. ఇప్పుడివన్నీ పంచుతున్నారు. వరి కొంచెం కొంచెం మొలకొస్తోంది. జొన్న ముక్కిపోతోంది. అదే ఏడాది చాంగ్ చింగ్ – సియాంగ్ హాన్ని కొంత ధాన్యం అప్పుగా అడిగితే "నాకు తింటానికేలేదు, నీకేంపెట్టను?" అన్నాడు ఇప్పుడు చాంగ్ కొంత ధాన్యం వానన చూసి 'సూడండి బాబూ, కామందు లెలాటోల్లో! దాన్యం అంతా ముక్కిపోనాదిగాని హాన్ మాత్రం ఎవరికీ అప్పు ఇవ్వనేదు!' అన్నాడు.

మూడోరోజు (పశువులు) సొమ్ములు, బట్టలు, ఇతర వస్తువులుపంచేరు. ఆడామగా ముసలీ ముతకా అంతా చేరేరు. ఏదో పెద్ద సంబరంలా అందరూ నవ్వుతూ తుళ్ళుతూన్నారు.

ఖాళీ జాగా అంతా బట్టలు, దుప్పట్లు, రజాయిలు, గిన్నెలు వీటన్నిటితో నిండిపోయింది. అంతా రంగులు రంగులుగా కనిపిస్తోంది. పోలమ్మ జాతరలా వుంది.* ఆనందం పంచుకోవడానికి చిన్నవాంగ్, లియూ-షెంగ్, సియావో కూడ వచ్చేరు. ఓల్డ్ సన్ ఓ చిన్నగుంపుతో హుషారుగా మాట్లాడుతున్నాడు.

"ఓల్డ్ సన్, మరో ఎలుగుబంటి కథ చెప్తున్నావా?" అన్నాడు సియావో.

"సియావో బాబూ ఈ తోలు కోటుసూడు. ఈల్లంతా 'ఈతోలు ఉత్తరాది తోలు, శానా గొప్పది' అంతన్నారు. "అందరికీ పని కొచ్చే గడ్డిపాటి సెయ్యదిది" అంతన్నా నేను." అంటూ ఓల్డ్ సన్ ఆకోటు సియావోకి చూపించేడు

"ఇది సూడు బాబూ, ఇదేటవుతాది? దీనికన్నా కుక్కతోలు నయం. ఎవలైనా బండోడు దీన్ని లోడుక్కోని, కొండమీంచి కట్టెలు తోలుకొస్తే, సందెకేల ఇంటికెల్లే పాటికి దీని రూపేమిగల్దు."

"నీకిస్తే తీసుకుంటావా?" అని అడిగేడు సియావో

"తీసుకుంతానే. ఇది పట్నంలో అమ్మితే గుర్కం కొంటానికి డబ్బొస్తాది." అంటూ సియావోతో పాటు మిగిలిన వస్తువులు చూడడానికి కదిలేడు ఓల్డ్ సన్.

"ఎన్నేసి బట్టలో సూడ్డూ! హాన్ ఇంటో ముప్పైమంది వుండేటోల్లు. అలు రోజుకి మూడుమార్లు మారిసినా మూడేల్లు సులాగ్గా వస్తాయి. ఈ నక్కతోలు కోటు సూడుమీ, అడి పిల్లలక్కూడా కోటులుండేవి. ఇదో ఈ గొర్రె తోలు కోటు- ఇది ఏదేశం కోటో!" అన్నాడు ఓల్డ్ సన్.

"ఏ దేశానిదీకాదు, మన దేశానిదే. గోడకి ‡ వడమరన దొరుకుతాది." అంటూ ఎవరో నవ్వుతూ అతని తప్పు దిద్దేరు.

మరోకుప్ప కేసి చూపుతూ అదేమిటని అడిగేడు సియావో. ఓల్డ్ సన్ కిందా మీదా వేసి చూసేడుగాని అదేమిటో తేలలేదు. అందుకని "నువ్వే తంతావ్ బాబూ?" అని అడిగేడు.

---

* May Fair in the Heavenly Bliss Monastery in Harbin.

‡ చైనాగోడ (Great wall)

"నీకెరిక నేదా?" అన్నాడో కుర్రాడు

"అదా అదోరకం వూలు బనీను" అన్నారు మరెవరో.

"ఊలు బనీనా? అది చినిగిపోతాది. దాన్ని బండోడు తొడుక్కుంటే ఏ కొమ్మకో తగులుకుని చినిగిపోతాది".

అలా ఒక్కొక్క కుప్పచూసుకుంటూ ముందుకెళ్ళేరు.

ఓ నీలంపూలు కర్టెను లాంటిది చూపిస్తూ సియావో

"ఇదేమిటి?" అన్నాడు.

"అది గుర్రబ్బండీమీద పైకప్పు. గొప్పోళ్ళకి ఒక్కో కాలానికి ఒక్కో కప్పువుంటాది. సలికాలానికి లోపల దూదిపెట్టి కుట్టిన కప్పువుంటాది. పైన మంచు కురుస్తుంటే లోపల ఎచ్చగా కూకుడుండొచ్చు".

ఈగుడ్డ చుట్టూ ఇంకా జనమూగేరు.

"ఈ నీలంగుడ్డ వున్నాదికదా, ఇది మంచుకోకాలంలో నేసింది" అన్నాడు ఓల్సన్.

"శానాగట్టిది" అన్నాడు ఓ గడ్డిటోపీ మనిషి

"అవును శానా మంచిగుడ్డ" అన్నాడు మరో పాతటోపీ మనిషి.

"పంట్లాముకి మంచిగుడ్డవుతాది" అన్నాడో బట్టతల మనిషి.

ఈ గుడ్డవున్న కుప్పలోకి ఎవరో జాకెట్లు విసిరేరు. కాని ఓల్డ్సన్ వాళ్ళని ఆపేడు.

"ఈ గుడ్డొక్కటిసాలు. ఆగుడ్డముక్కలు మరెందులోనన్నా కలువుమీ అల్లక్కడ సిలుకురైక వున్నాదికదా, ఈగుడ్డలు అందల వెయ్యి. ఆ సిలుకుగుడ్డ ఏటవుతాది? రొండ్రోజుల్లో పిగిలి పోతాది. పనిపాటలు సేసుకునే మన ఆడోల్లకి గట్టిగుడ్డలే కావాల. అకుప్పలో గట్టిగుడ్డలు పడెయ్యడం నాయం కాదంటావా?హాన్‌గాడిని పడగొట్టేందుకు అందరూ సేతులు కలిపేరుకాదా?"

అక్కడినుంచి జోళ్ళకుప్ప వేపు వెళ్ళేరు

"జోల్లకొట్టో వున్నట్టే వున్నాది" అన్నాడు ఓల్డ్‌సన్. అక్కడ మూడొందలకి పైగా జోళ్ళున్నాయి— ఆడవాళ్ళవి, మగవాళ్ళవి, పిల్లలవి, తోలువి, రబ్బరువి, వానాకాలపువి, శీతాకాలపువి, పూలుఅంచులవీ, కుందేలు చర్మం అంచులవీ— ఓ పెద్దజోళ్ళ దుకాణానికి సరిపడినన్ని వున్నాయి.

"అదీసంగతి, కామందులంతా జోల్లట్టుకొక్కుంటే నాకు జోల్లేడనుంచి వస్తాయి! జోల్లు ఎలా పంచుతారు బాబూ?"

జోళ్ళ పంపకం 'చూ' చూసుకుంటున్నాడు.

"జోల్లు కావలసినోల్లు తీసుకోవచ్చు. కాని పైస లివ్వాల" అన్నాడు.

"గుడ్డలు పూరికే పంచుతున్నారు గదా మరి?" అని అడిగేడు ఓల్డ్‌సన్.

"అవునుమరి గుడ్డలు అందరికీకావాల. జోల్లు అలాగకాదు గదా? కొందరిక్కావాల, కొందరికి అక్కర్లేదు. కావలసినోల్లు తీసుకుంటారు".

"పైసలంటే జోడుకెన్ని అంతావ్?"

"ఉప్పుడు నువ్ 1, గ్రేడ్ 1 వోడివనుకో. నీకు ఏభై రూపాయల సరుకు రావాల. ఒక్కొక్క బట్టలకుప్ప నలభై రూపాయలు. నువ్ గాని ఓ బట్టల కుప్ప ఎంచుకుంటే నీ కింకా పది రూపాయల సరుకు మిగిలివున్నాదన్న మాట. అప్పుడు నీక్కావలసింది ఎంచుకోవచ్చు- జోల్లు, బొచ్చెలు, గొడ్డల్లు, కొడవల్లు, గరితలు, దారపు వుండలు- నీ యిష్టం" అన్నాడు చూ.

"ఈ ఆలోశనంతా ఎవురిది బాబూ?"

"వైస్ సెయిల్‌మన్ కువోది"

"మాదొడ్డ మనిసి! నాకో గుర్రం ఇస్తారేటి?"

"ఇస్తారనుకుంటా. కాని అప్పుడు నీకు గుడ్డ లీరు."

"కువోని అడుగుదాంరా బాబూ" అని సియావోని, చిన్న వాంగ్‌ని, లియూ-షెంగ్‌నీ కూడా తనతో తీసుకెళ్ళేడు.

కువో, పాయి, పెద్దలీ మూడు రోజులుగా ఇంటికి పోకుండా, సరిగా నిద్ర పోకుండా పనిచేస్తున్నారు. రైతు సంఘ నిర్వహణ విషయాలు చూసేక చావోకూడా వాళ్ళకి సాయమొచ్చేడు. మరో ముప్ఫైమంది కొత్త యాక్టివిస్టులతో కలిసి అతికష్టంమీద సామాను సేకరించి, వాటిని కుప్పలుగా వేసి, ధరలు నిర్ణయించేరు. ఇంట్లో పెళ్ళిలాగా అందరూ ఎంతో వుత్సాహంగావున్నారు. ఓల్డ్‌సన్‌ని అందరూ హుషారుగా పలకరించేరు.

"నీకేంకావాలి ఓల్డ్‌సన్?" అని అడిగేడు కువో.

"నువ్ ఏదిస్తే అది తీసుకుంటాను బాబు" అని నవ్వుతూ అన్నాడు ఓల్డ్‌సన్. కాని అతని చూపంతా గుర్రపుసాల మీదేవుంది.

"అయితే ఈ రెండు తలగడలు తీసోక్- నీకు, నీ అడదాయికీ, ఎంత మెత్తగున్నాయో సూద్దూ!" అంటూ కువో పూలుకుట్టిన తలగడాలు తీసిచ్చేడు. ఓల్డ్‌సన్ వాటివంక కళ్ళు పెద్దవిచేసి చూసేడు "సందమామ, ఎర్రపూలు, సరుకు సెట్లూ" అంటూ గొణిగేడు. "సూడు అచ్చరాలు కూడా వున్నాయే! లియు- బాబూ, ఇదేటో సదివి ఇనిపిస్తావా?" అన్నాడు ఓల్డ్‌సన్.

తలగడమీద అక్షరాలు ఎర్రదారంతో కుట్టివున్నాయి.

"శుభాకాంక్షలు!" అని చదివేడు లియూ-షెంగ్.

"మంచి మైరవుకే సెప్పేరు" అని నవ్వేడు ఓల్డ్‌సన్. "మొండి మొలోళ్ళకి గుడ్డలు, తిండి లేనోళ్ళకి తిండి- మరి అంతా సంతోసంగా నేరా? నీ సుబాకాంచలు దేనికి? అల్లా తలగడమీద ఏటున్నాది?"

"అందమైన పూలు, పున్నమి చంద్రుడు"

"అదేటది?" అన్నాడు ఓల్డ్‌సన్ ఎడమకన్ను చిన్నదిచేస్తూ.

"అందమైన పూలంటే అప్పుడే విచ్చుకుంటున్న రెండు పూలన్నమాట. వాటిమీదగా వెలిగిపోతున్న పున్నమిచంద్రుడు. మొత్తానికి ఈ తలగడలు రెండూ నీకు బాగా నప్పేయి" అన్నాడు లియూ-షెంగ్.

"ఏటేటి, ఇచ్చుకుంటున్నపూలు నాకునప్పేయా? నాకు యాభై ఏళ్ళు, నా అడదాయికి నలభై తొమ్మిది. మా(వేనేటి, అయిచ్చుకుంటున్న పూలు?" అంటూ తమాషాగా నించున్నాడు.

అందరూ గొల్లున నవ్వేరు.

"పోరా పోకిరీ" అన్నాడు చావో.

పెద్దలీ నవ్వుతూ కువోని తట్టి "శుభాకాంక్షలు" అన్నాడు.

అసలు నవ్వనిదల్లా ఓల్డ్‌సన్ ఒక్కడే. అతనితీరేఅంత. పక్కవాళ్ళని నవ్విస్తూ తనుమాత్రం ఏమీ అర్థంకానట్టు నించుంటాడు. తర్వాత ముఖాన్ని రకరకాలుగామార్చి అందరినీ ఇంకా నవ్విస్తాడు.

"నానీ తలగడాలు ఉచ్చుకోలేను" అన్నాడు ఓల్డ్‌సన్.

"మరేటి కావాల?" అంటూ నవ్వుఆపేడు కువో.

"నాలుగుకాళ్ళది – ఏదైనానసరే!" అని మళ్ళా గుర్రపుసాల వేపు చూసేడు.

"ఓస్, ఇంతేనా? నాలుగుకాళ్ళవి శానావున్నాయి. అల్లదిగో, అబల్ల సూడు — ఒకటి, రొండు, మూడు, నాలుగు కాల్లు మరదితీస్కో"

"బల్ల నానేటి సేస్కోను? తిని, పరుగెత్తే నాలుగుకాళ్ళది కావాల. పుట్టిన కాన్నించీ బండి తోల్తన్నాను. గానీ సొంతగుర్రం నేదుగదా!"

కువో సరసాలు ఆపేసి గంభీరంగా "నీకు గుర్రం కావాలంటే ఆలోసించిసెప్తాం" అన్నాడు.

అసాయంత్రానికి మూడొందల కుటుంబాలకిపైగా అన్నీ పంచేసేరు— బట్టలు, మూడు గంగాళాలు, చిక్కుడునూనె, పందికొవ్వు, ఓ గుండిగ, మూడొందల కిలోలపైగా ఉప్పు, నూటనలభై నాలుగు కుటుంబాలకి ముఫ్ఫై ఆరు గుర్రాలు, గాడిదలు పంచేరు— నాలుగు కుటుంబాలకి కలిపి ఓ జంతువు, సరిగ్గా చెప్పుకోవాలంటే ఒక్కో కుటుంబానికి ఒక టే కాలు. ఓల్డ్‌సన్‌కికూడా ఎల్లగుర్రం కాలోటి ఇచ్చేరు.

రైతుసంఘం ఆఫీసు హాన్ ఇంట్లో ఏర్పరిచేరు. ఇల్లులేని కువోకి లోపల గదొకటి ఇచ్చేరు. తీన్‌తాత గదుల్ని గుర్రపుసాలగా హాన్ మార్చినందుకు, ఆయింటి తూర్పుభాగంలో మూడు చిన్నగదులు తీన్‌తాతకిచ్చేరు. ఇంతలో హాన్ భూమి మరోవంద ఎకరాలు బైటపడింది. భూమిలేని గ్రామస్తులకి అది కూడాపంచేరు. ఇంక ఇరవై పందులు, ఎనిమిది బాతులు మిగిలేయి. బాతులు ఎవరూ తీసుకోలేదు.

"ఆ పొడుగు మెడోటిమీద డబ్బు దండగ" అన్నాడు ఓల్డ్‌సన్.

"పోనీ మేంవూరికే ఇచ్చేవనుకో" అన్నాడు కువో.

"నానూరికేకూడ ఒప్పను. ఇవి మాలావు తిండి తింతాయి. పేదోల్లు ఆటిని మేపాల్నా? మాబల్లకాదు" అని వివరించేడు ఓల్డ్‌సన్.

పందుల పంపకం దగ్గర చిన్న పేచీ వచ్చింది. కామందులపై రైతుల విజయానికి చిహ్నంగా విందు భోజనం ఏర్పాటుచెయ్యాలన్నారు ఎవరో, కాని చావో ఒప్పుకోలేదు.

ఇప్పుడు మనంవే దొరలం, కానిముందు సూవుండాల. అప్పుడే ఇందు బోజనాలుకాదు. ఈపందులు రైతుసంగంకాడ్నే వుంతాయి. ఈసాలుసివర్న ఈటినిఅమ్మి, గుర్రాలు కొనాల. ఇప్పుడు మనకి ఒక్కోల్లకి ఒక్కో కాలేకదా

వున్నది? తర్వాత రెండు కాల్లురావాల. సంవత్సరాది పండక్కి నాలుగు కాళ్లూ వచ్చెయ్యాల. ఏతంతారు?"

''అది బాగుంది" కువో వెంటనే సమాధానమిచ్చేడు.

''నిజవే" నన్నాడు ఓల్డ్‌సన్

"సరి, ఆపనయిపోనాది" అన్నాడుకువో. కానీ ఇంకా ఆ పందుల్ని తినాలని వున్నవాళ్ళు మాత్రం మాటాడలేదు.

ఆరాత్రే అస్థిపంపకం అవగానే కువో హాన్ ఇంట్లోకి మారిపోయేడు. తీన్ తాత అమర్నాడు మారేడు.

మూడొందలకి పైగావున్న పేదగ్రామస్తులంతా హాన్‌ఆస్తికి వాటాదారులయేరు. ఇప్పుడు అందరికీ కట్టుకోను గుడ్డలు కాంగ్‌మీదికి దుప్పట్లు, తినేందుకు తిండిఉన్నాయి. తరతరాలుగా గుర్రాలులేనివాళ్ళకి ఇప్పుడు ఓ గుర్రపుకాలువుంది నూనెరుచి తెలీనివాళ్ళు ఇప్పుడు కాగుతున్న నూనె వాసనచూస్తూ ఆనందిస్తున్నారు. ఆనందం పట్టలేక కొందరికి తిండినయించలేదు, కొందరికి నిద్రపట్టలేదు.

"ఇదే అసలైన సొతంతరం" ముసలమ్మలు నొక్కిచెప్పేరు.

"ఇదే అసలైన పెజాసామ్యం" ముసలయ్యలు పలికేరు.

"మనకి జరిగిన అన్నేయేలు తుడుసుకుపోనాయి. ఉప్పుడు తిండివున్నాది" అన్నారు మధ్య వయస్కులు.

"మనకి కొత్త బతుకు ఇచ్చినోల్లని యాదుంచుకోవాల. నీలు తాగేటప్పుడు, సుఖ్య తప్పినోన్ని తల్సుకోవాల" అన్నారు సంఘం సభ్యులు.

"మనకింతసేసింది ఎవరు? కమినిస్టు పార్టీ, మనోల్లు, మన సైన్యం.* అల్లని మర్సిపోనేగూడదు" అన్నారు యాక్టివిస్టులు.

గ్రామమంతటా విప్లవజ్యోతి వెలుగుతోంది. రైతులంతా పట్టరాని ఆనందంతో ఏవీ మాటడలేక పోతున్నారు. చాంగ్ చింగ్-సియాంగ్ తన రబ్బరుజోళ్ళు చూసుకుని మురిసిపోయేడు. చాలా ఏళ్ళకిందట తననూతిలోని నీళ్ళు తోడుకున్నందుకు ఇదే జోళ్లతో హాన్ తనని మూడు గట్టి తన్నులు తిన్నేడు ఇప్పుడు ఆ జోళ్ళు తన స్వంతం అయినందుకు ఆనందం పట్టలేక

---

* సంఘటిత ప్రజా స్వామ్య సైన్యం.

పాటలు పాడుతున్నాడు. ఎండయినా, వానయినా ఆ వానకాలపు జోళ్ళని మటుకు వదల్లేదు. ఎండలో ఆ జోళ్ళని అందరూ చూడాలని తొడుక్కునేవాడు వానల్లో తిన్నగా బురదగుంటల్లోకి నడిచేవాడు. పొరపాటున పక్కవాళ్ల మీద నీళ్ళు తుళ్ళితే ఆ బురదని తనే తుడిచేసేవాడు.

అతని పొరుగునున్న హువా యంగ్-సీకి అడోళ్ల బొచ్చుకోటు ఇచ్చేరు. అతను ఎవరింటికైనా శుభాకాంక్షలు చెప్పేందుకు వెళ్తే, అందరూ అతని చుట్టూ మూగేవారు.

"దచ్చినాది సరుకు" అని ఒకరు.

"ఒచ్చేది శీతకాలం. ఇది మంచి బహుమానం" అని మరొకరు.

"మంచిదే మరి ఎంత మెత్తగా, ఎచ్చగావుందో సూద్దూ- దీన్ని తాకితేసే మంచు కరిగిపోతాది!"

"కానీ, ఇది అడోల్ల కోటు అయిపోనాది."

"మనువాడి నీ అడదాయికి ఇచ్చేద్దూ" అన్నారెవరో.

"లేకుంటే ఎవరినైనా వుంచుకో" అన్నాడు వూ. వూ ఓ విధవని వుంచుకున్నాడు. ఆమె కూడా ఎదిగిన కొడుకొకడు వచ్చేడు. పనిపాటలు చెయ్యగల ఈడు. రెండు విధాల లాభం కాబట్టి ఈ సలహా యిచ్చేడు. అందరూ తనని చూసి నవ్వుతున్నారు. ఇప్పుడు హువా తన సలహా పాటిస్తే తనకి తోడుంటాడు.

రాత్రి ఎవరిళ్లకు వాళ్ళు వెళ్లిపోయేరు. జరిగినదంతా మర్చిపోయేరు. కాని హువా ఆలోచిస్తూ నెమ్మదిగా ఇల్లు చేరేడు. ఆ రాత్రి అతను సరిగా నిద్రపోలేదు. ఇప్పుడు తనకి ముఫ్ఫయ్యో ఏడు దాటుతోంది. సంఘం మారింది. తనకీ పెళ్లాం పిల్లలు కావాలి. కాని డబ్బెక్కడిది? పోనీ ఈ చలికోటు అమ్మేస్తే? కాని తనని ఎవరు మనువాడతారు? తనకి సరిపడ పిల్లలేదు ఊళ్లో. ఉన్నట్టుండి చాంగ్ భార్య- విధవ గుర్తొచ్చింది. మీటింగులో హాన్ మీద ఆరోపణ చేసిందీవిడే. ముప్ఫై ఆరేళ్ళుంటాయి. చూపులకు బాగానేవుంటుంది "కుదిరిపోయినట్టే" అనుకుని అర్ధరాత్రి నిద్రపోయేడు- తను ఒప్పుకుంటే చాలన్నట్టు. ఉదయం లేవగానే ఏమీ తిననైనా తినకుండా ఆవిడ దగ్గరకు వెళ్ళేడు. ఇల్లు దగ్గరౌతుండగా జంకేడు. 'నీకెందుకు ఫో అంటే?' అనుకోగానే ముఖం ఎర్రబడింది, గుండె వేగం హెచ్చింది. వెనక్కి తిరగాలనుకున్నాడు. కాని ఆవిడ తనని చూసేసింది.

'హువా బాబూ, లోనికిరా! టీ నీలు తాగినావేటి?' అని కిటికీలోంచి పిలిచింది చాంగ్ భార్య.

'తాగేసినాను' అని అబద్ధమాడేడు హువా.

'అయితే ఇప్పుడు ఎందాక ఎల్తున్నావూ? పొద్దుపొడక ముందే బయల్దేరే వేటికథ?' దుప్పటి కుట్టుకుంటూ నవ్వుతూ అడిగింది ఆవిడ.

'నాను– నాను చావోతో మాటాన్నానికి రైతుసంగానికి పోతున్నా' ఒక అబద్ధానికి మరో అబద్ధం జతచేసేడు.

'నీకు శానా పనికదా?' ఓరగా చూస్తూ అడిగింది.

"ఈమద్దె పనెక్కువగా వున్నాది. చైర్మన్ చావో నన్ను చేరమన్నాడు. నానొప్పుకున్నా...." ఇంకేం చెప్పాలో తెలీక ఆగిపోయేడు హువా. మళ్ళ ముఖం ఎర్రబడింది. కొంతసేపు ఇబ్బందిగా ఆగిపోయేక మళ్లీ మాట ఎత్తుకున్నాడు.

"నీ కాంగ్ బాగయిపోనాదా?"

"నేదు. ఎవరూ సాయం సేయనేదు." తలొంచుకుని కుడుతూనే అంది.

"నాను సేస్తాను." అన్నాడు హువా– నీటిలో మునుగుతున్న మనిషికి గడ్డిపోచ దొరికినంత ఆత్రంగా, ఆనందంగా.

"బాబ్బాబు, ఆ సాయం సేసిపెడుదూ. మరెప్పుడొస్తావ్?"

"ఎప్పుడు రమ్మంటే అప్పుడు".

హువా గాలిలో తేలిపోతూ ఇంటికి వెళ్ళేడు. కొద్దిరోజుల్లోనే వాళ్ళిద్దరూ మనసువిప్పి మాట్లాడుకోసాగేరు. ఇద్దరూ కలిసి వుండడంవల్ల లాభాలు కూడా బేరీజు వేసుకున్నారు. కట్టెల ఖర్చుకూడా తప్పుతుంది. ఆవిడదగ్గర ఓ ఎర్రశాటిన్ పరుపువుంది. అది చెడకుండా దానిమీద పాతదుప్పటి ఒకటి కుట్టింది– హువా తనని చూడటానికి వచ్చిన మొదటి రోజు ఆదేకుడుతోంది. ఇద్దరూ ఒకే కాంగ్ పంచుకోవడానికి నిశ్చయించుకున్నాక కుట్టిన పాత దుప్పటి తీసేసింది.

హువాకి, ఆవిడకి వున్న సంబంధం కొద్దిరోజుల్లోనే వూరంతా పాకింది. చాంగ్ భార్య ఇంటి పొరుగునే వున్న 'చూ' ఈ సంగతి కనిపెట్టేసేడు మొదట. 'చూ' తన స్నేహితుడికి రహస్యంగా "ఈసంగతి మరెవ్వరికీ

సెప్పకు" అని చెప్పేడు. ఆ స్నేహితుడు మరో స్నేహితుడికి ఇలానే చెప్పేడు. అది అలా అలా పాకిపోయింది. కాని ఆ విషయం ఆఖరికి తెల్సిన మనిషికూడా తన స్నేహితుడితో "ఇది మరెవరికీ సెప్పకు, రహస్యం" అనే చెప్పేడు.

కాని మొదట 'చూ'కి ఎలా తెలిసింది? ఓ రాత్రి అతను గుర్రానికి మేత వేద్దామని లేస్తే, పొరుగింట్లో మగగొంతు వినిపించింది. కొద్దిసేపట్లోనే హువా బైటి కొచ్చేడు!

'చూ' కూడా పేదరైతే, చేపలు పట్టే కాలంలో అతను ఏటి ఒడ్డునే ఓ గుడిసె వేసుకుని వుండేవాడు. అతని పూర్వీకులకి గుర్రాలేలేవు. కాని ఇప్పుడు అతను కూడా ఓ మట్టిరంగు గుర్రానికి వాటాదారు. దానికి ఆరేళ్ళుంటాయి. చాలా బరువు మోయగలదు. మిగతా ముగ్గురూ ఆ గుర్రాన్ని 'చూ' ఇంట్లోనే వుంచడాని కొప్పుకున్నారు. ఆ గుర్రాన్ని యింటికి తీసుకొచ్చిన రాత్రి ఆనందంతో 'చూ'కి, అతని భార్యకి నిద్ర పట్టలేదు.

''ఇంకా తొంగోనేదేఁ?''అని 'చూ' అడిగేడు

"నువ్వేల తొంగోనేదూ?"అని ఎదురాడిగిందావిడ. "సూడు, అదిదానా తింటున్న సప్పుడు ఆగిపోనాది. దానాగాని అయిపోనాదేటి? పోయిసూద్దూ."

ఇద్దరూ చెరో క గోనెకప్పుకుని బైటికి వెళ్ళేరు. వాళ్ళిదరికీ పంపకంలో బట్టలొచ్చేయిగాని, వాళ్ళు అవి దాచుకున్నారు. ఓ బుడ్డీ దీపం వెలిగించుకొని బైటికి నడిచేరు. దానా అయిపోయింది. 'చూ' కొంచెం పచ్చగడ్డి వేసేడు. అతని భార్య కొంచెం తౌడు కలిపింది. తర్వాత కొంచెంసేపు దాన్ని అలా చూస్తూ నించున్నారు.

"ఈ గుర్రం లోగడ 'కూ'ది"అని భార్యకి చెప్పేడు చూ. "అయిదేళ్ల కితం 'కూ' హాన్ కాడ పదెకరాలు కౌలుకి తీసుకున్నాడు. వరదొచ్చి పంటంతా కొట్టుకుపోనాది కాని 'కూ' హాన్‌కి కౌలు డబ్బు ఇచ్చుకోవలసిందేగదా? అప్పుడే ఈ గుర్రం యిచ్చీసినాడు. చైర్మన్ చావో గుర్రాన్ని 'కూ'కి ఇయ్యబోతే 'కూ' వద్దన్నాడు."

'ఏఁ?'

'కూ'కి నమ్మకాలు లావు. తన సొంత గుర్రం ఒద్దన్నాడు. 'మంచి గుర్రం ఎనక్కి తిరిగి గడ్డి కరవదు' అన్నాడు.

'మరైతే దీన్ని నువ్వెలా తెచ్చినావురా, ఎర్రి మొగమా?' అంది భార్య

"ఎర్రి మొగం నీదా, నాదా? 'కూ'కి నమ్మకాలు లావు గదాని నానూ నమ్మకాలెట్టుకుని ఇంత మంచి గుర్రాన్ని ఓగ్గేయ్యాలేటి? ఓ పాలిదాన్ని సూద్దూ— సిన్ననోరూ, జమాయించి వున్న కండలూ, మెత్తగా, బలంగావున్న కాళ్లూ."

"నీ వాటాకొచ్చింది ఒక్క కాలే కదేటి? అంతలా సంబరపడి పోతా వేటి, సోకు!" అంది అతని భార్య.

కానీ నిజం చెప్పాలంటే ఆమెకి కూడా చాలా తృప్తిగా వుంది. గుర్రం మూలాన మొగుడిమీద ప్రేమ ఎక్కువయింది. కాంగు మీద పడుకున్నాక గుర్రం మేస్తున్న చప్పుడు వింటూనేవుంది.— ఈ భూ ప్రపంచంలో దాన్ని మించిన సంగీతం లేనట్టు! ఉన్నట్టుండి మొగుడ్ని తట్టి,

'ఎంత బాగా మేస్తున్నాదో, ఇను!' అంటూనే వుంది.

ఆ గ్రామంలో మరో జంట కూడా ఆనందంతో నిద్రపోలేదు. తీన్ తాత, అతని భార్య ఇల్లు మారేరు. వాళ్ల కూతుర్ని పాతిపెట్టిన దగ్గరలోనే వాళ్లకి ఐదు ఎకరాలు కేటాయించేరు. మర్నాడు మధ్యాహ్నం తీన్ తాత గట్లు పెట్టడానికి వెళ్తుంటే అతని గుడ్డి భార్య కూడా పొలం ఎలావుందో చూడాలని మొండికేసింది. తీన్ తాత ఆమెని చెయ్యి పట్టుకు నడిపించుకు వెళ్ళేడు.

ఆమె కింద చతికిలబడి ఓ గట్టుని తడిమింది, ఓ జొన్న కంకిని ప్రేమగా నిమిరింది. ఓ మట్టి పెళ్లతీసి ఎంతో ప్రేమగా మట్టి అంతా వేళ్ల సందుల్లోంచి జారేలా చిదిపింది. చిరునవ్వు నవ్వింది. ఇప్పుడు ఆ భూమి తమ స్వంతం. వాళ్ల ముందు తరాల వాళ్ళెవరికీ ఇలా జరగలేదు. తమకీ మడిచెక్క ఇంకా ముందే దక్కితే కూతురు దక్కేది.

"ఈ సాలు పంట ఎవరిది?" అని అడిగింది.

"బూనితోపాటే పంట" అన్నాడు తీన్ తాత.

సూర్యుడు అస్తమిస్తున్నాడు. జొన్న, మొక్కజొన్న కంకుల్లోంచిగాలి ఈలవేస్తూంది. జొన్న పండి పోతోంది. మొక్కజొన్న వాడి పోతోంది. ఆమె అలాగే కూర్చుంది.

"పొద్దు పోనాది, పొదాం రాయే" అన్నాడు తీన్ తాత.

"నువ్ ముందుపో. మన పిల్లదాని సోటు సూసిరావాల ఈ బూవే అప్పుడుంటే మన పిల్ల సవ్వకుండును" అంటూ కళ్ళు తుడుచుకుందామె.

"పోదాంరా. మబ్బులుకూడా పడతన్నాయి. మనంబేగి పోకపోతే తడిసి ముద్దయి పోతాం." కూతుర్ని పూడ్చి పెట్టినచోట కూర్చుని చాలాసేపు ఏడుస్తుందేమోనని తీన్ తాత అబద్ధమాడేడు.

దారిలో ఒల్డ్‌సన్ తగిలేడు.

"ఎక్కన్నించీ?"

"మా బూవి సూనుకోనానికి పోనాం"

"బండెక్కండి", ఇద్దరూ ఎక్కేరు.

గుర్రం జోరు పెంచేసరికి "ఈ గుర్రం సూడు ఎంత జోరుగా పోతున్నాదో!"

"బాగున్నాది. ఒయసెంత?"

"ఎనిమిదేల్లు. నాది ఒక టేకాలు. పెద్దలీది మరో కాలు. కాని నాను పెద్దలీతో 'నువ్వు కమ్మరివి. నీకు గుర్రం దేనికి? నువ్ వూళ్ళో గుర్రాలన్నిటికి నాడాలెయ్యాలి కదా, నీ గుర్రానికి దానా ఎప్పుడేస్తావ్? నీకాలు కూడా నాకిచ్చెయ్యి. నువ్వు రైతు సంఘ సభ్యుడివి, ఆ మాత్రం సెయ్యలేవేటి?' అన్నాను. అప్పుడు పెద్దలీ నాకిచ్చీసినాడు. 'నువ్ శానా మంచోడివి. నీలాంటి ఆపీసరుకి నానెప్పుడూ సాయముంతాను. నా గుర్రం నాడాలకి నీకాడికే ఒస్తాను' అన్నాడు. ఇప్పుడు రెండు కాల్లు నాయి. సూడు సూడు దీని నాలుగు కాల్లు బూమ్మీద లేవు! మంచి గుర్రాన్ని దాని సెరమం, గిట్టలు సూసి కనిపెట్టొచ్చు".

"ఎక్కడికెల్తన్నావ్?" అని తీన్ తాత అడిగేడు.

"ఉత్తరవు ఇంటికి. ఇకదాన్ని 'హాన్ యిల్లు'కాదు, ఉత్తరవు ఇల్లు అనాల. వైస్ సెయిర్మను కువో పంచిన సరుకు ఏటీ తీసుకోనేదు తను. తిండి గింజలు అయిపోనాయట. నానేదో తీసుకుపోతున్నా. ఓ! ఓ!" బురదగుంట దాటేక మళ్ళీ మొదలెట్టేడు. "ఆ పందుల కాపరి అస్పత్రికాన్నించి వొచ్చీసినాడు, ఎరికా? దెబ్బలు మాసిపోనాయి. ఎనిమిదోదళం డాటర్లు మాగొప్ప మనుసులు. ఆలు * హువాతోని మించినోలు. పందుల కాపరికి బాగా మోవుగా తగిలేయి కదా దెబ్బలు, అయినా ఆలు బాగు సేసేరు."

* 3వ శతాబ్దంలో గొప్ప శస్త్ర వైద్యుడు.

"ఆడికి అమ్మా, బాబూనేరుగదా, ఇప్పుడు ఎక్కడున్నాడు?" అని అడిగింది తీన్ తాత గుడ్డిభార్య. ఇంకా మాటాడేందుకు అవకాశం చిక్కినందుకు సంతోషించేడు ఓల్డ్ సన్.

"వైన్ సెయిర్మను కువో అ బుడ్డోడిని తనకాడ వుంచమన్నాడు. కాని సెయిర్మను చావో 'నువ్ ఆ పిల్లోన్ని ఎలా సూసుకుంతావ్? నువ్వేమో ఒంటరిగాడివి. పిల్లోన్ని సూసుకోడం మాటలనుకున్నావేటి? ఆడదాయి సూసుకుంటాదిలే. మాకు తిండి గింజలున్నంతదాకా ఆడికే లోటురాదు' అన్నాడు" అంటూనే ఒల్డ్ సన్ రైతు సంఘం ఆఫీసుముందు (హాన్ యిల్లు) "ఓ, ఓ" అంటూ బండి ఆపేడు. కిందికిదిగి ధాన్యపు బస్తా భుజానేసుకుని కువో గదిలోకి కుంటు కుంటూ వెళ్ళేడు. తిరిగొచ్చేసరికి తీన్ తాత భార్య అతనికి బంగాళా దుంపలు బుట్టెడు ఇచ్చి 'ఆ పందులకాపరికి ఇచ్చిరమ్మ'ంది. తన కూతురిలాగా చావుకి అమడ దూరందాకా హాన్ చేత తన్నులు తిన్నాడని ఆ కుర్రాడంటే అవిడకి వల్లమాలిన అభిమానం. ఓల్డ్ సన్ వెళుతుంటే ఇంత లావున ఎడంకన్ను వాచిన పాయి కనిపించేడు.

"నీ కన్ను ఏటయినాది బాబూ" గుర్రాన్ని ఆపుతూ అడిగేడు ఓల్డ్ సన్.

"ఇదంతా మా ఎర్రిమొకం దాని సలవ!" తన భార్యకీ తనకీ తగువైన వైనం చెప్పేడు పాయి. అతని వాటాకి ఇంటి దగ్గర్లోనే రెండెకరాలొచ్చేయి. కాని 'పార్టీ సభ్యులు తమ ప్రయోజనాలు కాపాడుకుంటున్నార'ని ఎవరో అన్నారు. ఇది విన్న పెద్దలీ పాయికి చెప్పేడు. అలాంటి అపోహాలు, అనుమానాలు పెరగనీకూడదని పాయి తన ఇంటికి చాలా దూరంగా వున్న భూమి తీసుకున్నాడు. తను చేసింది మంచిదేనని అతని నమ్మకం. ఆ సంగతి భార్యకి చెప్తే, ఆమె కుట్టుపని ఆపి అందమైన కనుబొమలు ముడిచి,

"నీకేం పోయీ కాలమొచ్చిందని బంగారం కింద ఒడీసి మట్టి ఓట్టుకున్నావ్! కాపరానికి ఒచ్చినయాల నించీ నీతో సుకపడింది నేదు. ముందూ వుండదుకాఁవాల" అంటూ తిట్టి దిగబారపోసింది.

"అదికాదే, సంగపోల్లం మంచిపనులు సెయ్యాల" అంటూ వివరించబోయేడు పాయి.

"మంచిపనో, సెడ్డపనో, నువ్ తిని బతకాల. బంగార్లాటి బూవి ఇచ్చేసి నవిటిపర్రలో సాగుకు తీసుకున్నావు. ఏటి సెయ్యాలని నీ వుద్దేశం?" అంది భార్య.

"ఏటవుతాది? ముద్దకి నోటురాదులే" అని కొంచెం కోపంగానే అన్నాడు పాయి.

"నాను సంగంకాడికి పోయి నా బూవి అడిగి తీసేసుకుంతా" నంది కాంగు దిగుతూ. పాయి ఆమెని ఆపాలని చూసేడు. జగడమయింది. ఆమె కడుతున్న చెక్క చట్రంతో పాయికి ఒక్కటిస్తే, అది కంటికి తగిలింది. రక్తం చూసి భయమేసి, పశ్చాత్తాపంతో, ఆగిపోయింది. గుడ్డతో నెత్తురు అద్దడమా, మానడమా అని ఆలోచిస్తూ కాంగు మీద కూలబడింది. పాయి బయటకు వచ్చేస్తూ "ఉత్త మోటు ముండ!" అనుకున్నాడు.

ఓల్డ్‌సన్ ఇది విని, కొరడా ఝళిపిస్తూ "ఆడోల్లంతా ఒకటే. తిన్నగా ఆలోసించరు. అయినా నువ్ తగువేసుకోపోతే సంగతంతా యిశదీకరించ గూడదా? నెమ్మదిగా మంచికి మారతాది. మన్ని సూసి పెట్టుబడిదారులు నవ్వకుండా సూస్కోవాల" అన్నాడు. అతను మధ్యనే కార్యకర్తల దగ్గర రైతుసంఘం దగ్గర 'విశదీకరించడం', 'పెట్టుబడిదారు' వంటి పదాలు నేర్చుకున్నాడు. అవి వీలైనపుడల్లా అంటూంటాడు. "నానైతే యిలా సేసేటోన్ని కాదు" అనుకున్నాడు ఓల్డ్‌సన్.

చావో ఇంటికి వెళ్ళి పందులకాపరికి తీన్ తాత భార్య ఇచ్చిన బంగాళా దుంపల బుట్ట ఇచ్చేడు. అప్పుడే వాళ్ళు భోంచేస్తున్నారు.

"నువ్వూ తిండి తిందువుగాని రావయ్యో" అంది చావో భార్య.

'ఒరేయ్, ఆ మలక అందుకోరా'

"నాను తినే ఒచ్చేను" అన్నాడు ఓల్డ్‌సన్. వాళ్ళు తింటున్నవన్నీ ఒక్కసారి పరిశీలించేడు— వుడకబెట్టిన చిక్కుళ్ళు, పచ్చి కాబేజి ఆకులు, రెండుపచ్చి మిరపకాయలు, గంజినీళ్ళు.

"నువ్ సూస్తే రైతుసంగం సెయిర్‌మన్‌వి. నువ్వు ఏటిసెపితే అది ఇనుకుంతారంత. మరి నువ్వేటి తింతన్నావ్? ఇంకా గంజినీళ్ళే తాగుతుండారా? పోసీ రొట్టెముక్కన్నా తినొచ్చుగదా?" అని సలహా ఇచ్చేడు ఓల్డ్‌సన్.

"ఇంతకీ జనం ఏటంతన్నారు?" చావో విషయం మార్చేడు. 'అంతా సుకంగున్నారా? ఈ సీతాకాలానికి బట్టలు సాల్తాయా?"

"జనానికి ఒక్కటే లోటట. అదేటంతే నువ్ శానా కొంచెం పుచ్చుకున్నావట. "చావో కూడా మాలాటి పేదోడేకదా? మా అంత కూడా పుచ్చుకోడా?" అన్నారు, నానేటంతానంతే మంచుకో పెబుత్వంలో అందరము పేదోల్లమే. అప్పుడు నీకు మంచి పేరునేదు చావో బాబూ. ఇప్పుడు పేదోల్లదే రాజ్జెం. ఊరి బాగు అంతా నువ్వే సూసుకుంతావ్. అయినా నీకేటీ ఒద్దంతావ్. నీ ఆడదాయి, కొడుకు ఎప్పటిలాగే బీదగానే వున్నారు. ఇది గోరంకాదా బాబూ? పెట్టుబడిదారులు మనని సూసి నవ్వుకుంతారు. 'నాలుగొందల గడపవుండి కూడా సెయిర్‌మన్ బాబుకి ఏటివ్వనేద'ని.

అందరూ నవ్వేరు.

'ఓల్డ్‌సన్! ఇప్పుడు మాకందరికీ గుడ్డలున్నాయికాదా?' అన్నాడు చావో, కాబేజి ఆకు పచ్చడిలో నంజుకుంటూ. కాసేపుండి ఓల్డ్‌సన్ వెళ్ళిపోయేడు. చావో భార్య, కొడుకు పాతబట్టలు తొడుక్కున్నారు. చావో తన పేరు క్లాసు-3, గ్రేడు-3 కింద వేసుకున్నాడు. తగినట్టుగానే పాత సామాను ఇచ్చేరు. పక్కవాళ్లు మంచి మంచి వస్తువులతో తిరిగి రావటం చూసి చావో భార్య కొంచెం బాధపడింది.

ఆ సాయంత్రం భర్తతో మెల్లగా 'మనం క్లాసు 1, గ్రేడు 1 వాళ్ళమటగా? మనకి యీ సింకిబట్టలకన్నా మంచివి రావాలని అందరూ అంటున్నారు. ఇవి చలి ఆపవు" అంది.

"కట్టుకోను గుడ్డలున్నాయిగదా, అయి సాల్లేవే. మంచుకో పెబుత్వములో గుడ్డముక్క లేకుండా గడువుకురానేదా?" అన్నాడు చావో.

అతని భార్య చాలా అమాయకురాలు. వెర్రిబాగుల్ది. ఒక్క మాటైనా ఎదురు చెప్పకుండా అతనితో కష్టాలన్నీ ఎదురీదింది. కీలుబొమ్మ మంచుకో ప్రభుత్వంలో చింకి గుడ్డలు కూడా లేక పొలం పనికి అర్ధనగ్నంగానే వెళ్ళేది. కాని మొగుడంటే అభిమానంవల్ల పేదరికాన్ని మారు మాటాడకుండా భరించింది. ఇప్పుడామె పెనిమిటి సంఘానికి ఛైర్మన్. అంటే ఏమిటో ఆమెకిసరిగ్గా తెలీకపోయినా అతను తెల్లవారుఝామునే లేస్తాడనీ, అందరికీ సాయం చేస్తాడనీ, అర్ధరాత్రి తిరిగొస్తాడనీ మాత్రం తెలుసు. నీళ్లు తోడిపెట్టడానికి కూడా అతనికి తీరికుండేదికాదు.

ఆ రోజు అసలతను కట్టెలుకొట్టి, మోపులు కట్టడంలోనే గడిపేడు—మరెవరికోసమో! తమ జీవితంలో మార్పులేకపోయినా ఆమె బాధపడలేదు.

నిజాయితీపరుడైన భర్తని ఆమె ప్రేమించింది— అతనే ఆమె సర్వస్వం, అతనే ఆమె ప్రాణం, జీవితం, అన్నీ.

"కట్టుకోను గుడ్డలున్నాయి, సాలు" అని అతనంటే ఆమె తృప్తి చెందింది. రైతుసంఘంలో అన్నీ సవ్యంగా జరుగుతున్నందుకు చావో ఆనందంగా వున్నాడు. అతనికి భార్య వుత్తమ యిల్లాలని తెల్సు.

"అందరికీ ఎక్కువ గుడ్డలుంటే, మనకీ వస్తాయప్పుడు. తొందరేముంది?" అని భార్యని సముదాయించేడు.

ఇంటి పనులన్నీ ఆమె మీదే వదిలేస్తున్నందుకు బాధపడ్డాడు. ఆమె పొరుగు వాళ్లని కట్టెలు అరువు అడగడం అతనికి తెలుసు. మర్నాడు మళ్ళీ కట్టెలు కొట్టాలనీ, కానీ యీసారి బండి అరువు తీసుకుని, కొట్టగానే యింటికి తీసుకురావాలని నిశ్చయించుకున్నాడు.

(ఇంకా వున్నది)

వి. ర. సం. కన్వీనర్ ఇంటిమీద పోలీసుల దాడి

విప్లవ రచయితల సంఘం తిరుపతి యూనిట్ కన్వీనర్ భూమన్ ఇంటి మీద 5-12-1973 ఉదయం పోలీసులు దాడిచేశారు. కల్లుతాగిన కోతుల్లాగ ఇంట్లో ప్రతి అంగుళాన్ని ఛిన్నాభిన్నం చేశారు, మూల మూలల వెతికి పుస్తకాలన్నింటిని విసిరికొట్టారు. తర్వాత 11 గంటలకు భూమన్‌ని పోలీసు స్టేషన్‌కి తీసుకుపోయి అనవసర ప్రశ్నలతో వేధించారు. మూర్ఖమైన ఈ పోలీసుచర్యను తీవ్రంగా నిరసిస్తున్నాను. ఇలాంటి దాడులకు, ఇంటరాగేషన్లకు విప్లవ రచయితలు వెనుకంజ వేయరని, వి. ర. సం. పోలీసు నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూ ముందుకు పోతుందని హెచ్చరిస్తున్నాను.

త్రిపురనేని మధుసూదనరావు

కార్యదర్శి,

విప్లవ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్.

భారత–చైనా ప్రజల మైత్రి వర్ధిల్లాలి!

అంతర్జాతీయ పంచశీల సూత్రాలపై పెట్టిన సంతకం తడి ఆరకముందే, అమెరికన్ సామ్రాజ్యవాద కుట్రలకు బలై, జాతియోన్మాదంతో రెచ్చి భారత ప్రభుత్వం కయ్యానికి కాలు దువ్వింది.

ఇదివరకు జనచైనా ఉనికిని గుర్తించ నిరాకరించిన అమెరికా, జపాన్ మున్నగు సామ్రాజ్యవాద దేశాలు లెంపలేసుకుని జనచైనాతో స్నేహానికి తహ తహలాడుతున్నా, ఈదశలో భారత ప్రభుత్వము సంపూర్ణ దౌత్య సంబంధాల పునరుద్ధరణకు బింకాన్ని ప్రదర్శిస్తూ కాలహరణ చేయడం క్షమించరాని జాతి ద్రోహమని విరసం భావిస్తూవుంది.

ప్రపంచాధిపత్యంకోసం అమెరికాతో కుమ్మక్కై జనచైనాపై అక్కసు వెళ్లగక్కుతూవున్న సోవియట్ సోషల్ సామ్రాజ్యవాద "ఆసియా భద్రత" కుట్రలో భారతదేశం పాలుపంచుకోవడాన్ని ప్రజలు ప్రతిఘటించి తీరుతారని వి. ర. సం. స్పష్టంచేస్తూవుంది. జనచైనా వ్యతిరేక జాడ్యంలో డల్లెస్‌కు వారసత్వం పుచ్చుకొన్న క్రెమ్లిన్ కుట్రలు యికపై చెల్లవని వి ర.సం. హెచ్చరిస్తూవుంది.

దేశవ్యాప్తంగా భారత చైనామైత్రి పునరుద్ధరణకు జరుగుతూవున్న (ఆంధ్రప్రదేశ్ ఇండియా–చైనా మిత్రమండలి, బెంగాల్ కోట్నీస్ మెమోరియల్ కమిటి వగైరా) కృషిని అభినందిస్తూ, దానికి తోడ్పడవలసిందిగా తోటి రచయితలను, మేధావులను, విద్యార్థులను, ప్రజలను వి.ర.సం. కోరుతూవుంది

భారత–చైనా మైత్రి పునరుద్ధరణకు అడ్డువచ్చే సామ్రాజ్యవాదం, అభివృద్ధి నిరోధక మత దురహంకార శక్తుల దుర్మార్గాన్ని ఎండగడుతూ, స్నేహవారధిని నిర్మించవలసినదిగా విరసం విజ్ఞప్తి చేస్తూంది.

(వి. ర. సం కార్యవర్గ తీర్మానం 2-12-1973)

భారత చైనా మిత్రమండలి

ఆంధ్రప్రదేశ్ మహాసభ

ఒంగోలులో 1974 జనవరి 6 ఆదివారం జరుగును

సోదరీ సోదరులారా!

ప్రపంచ పరిస్థితులు అతివేగంగా మారుచున్నవి. జనచైనా 1949 సం॥ లో అవతరించిన నాటినుంచి ప్రపంచ సామ్రాజ్యవాదులు ఆదేశాన్ని ఏకాకినిచేసి చుట్టుముట్టి అంతమొందించుటకు యెన్నో కుట్రలు పన్నుతున్నప్పటికీ, ఆ పథకాలన్నీ భగ్నమై జనచైనా నేడు పురోగమిస్తున్నది. చాంగ్ కై షేక్ ముఠాను గెంటివేసి ఐక్యరాజ్య సమితిలో తన న్యాయమైన స్థానాన్ని సంపాదించుకున్నది. కరుడుగట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకులయిన అమెరికన్, జపాన్, పశ్చిమ జర్మనీ సామ్రాజ్యవాద దేశాలు చైనా రిపబ్లిక్‌తో దౌత్య సంబంధాలకై ప్రదక్షిణలుచేసి నానాపాట్లు పడుతున్నారు. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా, యిటలీ మొదలగు సామ్రాజ్యవాద దేశాలుగూడ జనచైనాతో దౌత్య సంబంధాలు కలిగి ఆర్థిక, పారిశ్రామిక, సాంస్కృతిక ఒడంబడికలు చేసుకొంటున్నారు. ఐరోపా ఖండంలోని వివిధ దేశాలతో జనచైనా వాణిజ్య సంబంధాలు పెట్టుకొన్నది. ఆసియా, ఆఫ్రికా లాటిన్ అమెరికా ఖండాలలోని అనేక వెనుకబడిన దేశాలతోగూడ దౌత్య సంబంధాలు పెట్టుకొని మైత్రి ఒడంబడికలు చేసుకొంటున్నారు. అంతేగాక ఈ దేశాలకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తున్నారు.

జనచైనా మన పొరుగు దేశం. జనసంఖ్యలో ప్రపంచములో పెద్ద దేశము. అందుచే భారత-చైనా దేశాలు మిత్రులవలె జీవించుట ఉభయులకు క్షేమము. మనకున్న సరిహద్దు వివాదాన్ని శాంతియుత చర్యల ద్వారా పరిష్కరించుకొనుట లాభదాయకం. మిలిటరీ ప్రయత్నాలు, సరిహద్దు సంఘర్షణల ద్వారా పరిష్కరించుకోబూనుట దేశ ప్రయోజనాలకు హానికరం. అందుచే విజ్ఞతను ప్రదర్శించి జనచైనాతో దౌత్యసంబంధాలు పెంపొందించుకొనే చర్యలకు ప్రయత్నించాలి.

జనచైనా మొండివైఖరితో నున్నదని, భారతదేశం చర్చలకు సిద్ధమని ఇందిరాగాంధి స్వరణ్‌సింగ్ లు ప్రకటనలు చేస్తున్నారు. కాని ఆచరణలో భారత ప్రభుత్వం తీసుకొన్న మిత్రత్వ చర్యలేమీలేవు. ఇండియా-చైనా మైత్రికై జన

చైనా యితర దేశాలద్వారా తన సంసిద్ధతను పదేపదే తెలియజేసినట్లు పత్రికలలో అధికారయుతంగా వింటున్నాము. అంతేగాక జనచైనా తన పొరుగు రాజ్యమైన బర్మా, పాకిస్తాన్, మంగోలియా దేశాలతో సరిహద్దు సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకొన్నది.

అందుచే భారత చైనా మైత్రి ఒడంబడిక జరిగి రాయబారుల మార్పిడి జరగాలి అందుకు ముందుగా దౌత్య సంబంధాలు పునరుద్ధరించబడాలి. ఈవిషయాలను సమగ్రంగా చర్చించి ఉచితమగు నిర్ణయాలు చేయుటకు ఒంగోలులో 1974 సం॥ జనవరి నెల 6వ తేది ఆదివారం భారత చైనా మిత్రమండలి ఆంధ్రప్రదేశ్ ప్రథమ మహాసభ జరుగును. ఈ మహాసభలో పాల్గొనుటకు డా. కొట్నీస్ మెడికల్ మిషన్ సభ్యులు ఈ సంవత్సరమే జనచైనా ప్రభుత్వ అతిథిగా ఆ దేశం పర్యటించి వచ్చిన డా. బి. కె. బాసు తన అంగీకారం తెలియజేశారు. అంతేగాక ఈ మహాసభకు ప్రముఖ జాతీయవాదులైన పండిట్ సుందరలాల్, సుప్రీంకోర్టు ప్రముఖ అడ్వొకేటు డేనియల్ లతీఫ్, శ్రీశ్రీ, హన్స్ రాజ్ రహబర్ మొదలగువారిని ఆహ్వానించడమైనది. వారు అంగీకరించారు.

ఎంతో భారమైన ఈ కార్యక్రమం జయప్రదం చేయుటకు ఆంధ్ర ప్రజల సహకారాన్ని అర్థిస్తున్నాము. అతి స్వల్పకాలంలోనే మహాసభ తేదీని నిర్ణయించాము. కాన అలస్యం చేయక ఆర్థిక సహాయం అందించగోర్తాం. అదే విధంగా రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతినిధి వర్గాలు వచ్చి మహాసభను జయప్రదం చేయమని విజ్ఞప్తి చేస్తున్నాము.

ఒంగోలు
19–11–73

ఇట్లు
ఆహ్వాన సంఘం

1974 జనవరి 13, 14 తేదీలలో కర్నూలులో జరుగు
విప్లవ రచయితల సంఘం నాలుగవ రాష్ట్ర
మహాసభలను జయప్రదం చేయండి!

బ్రిటిషువారినుండి స్వదేశీ పెత్తందారులకు అధికార మార్పిడిజరిగి 26 సం॥లు గడిచిపోయాయి. ఐనా సామ్రాజ్యవాదుల దోపిడి ఈదేశంలో పదిలంగా కాపాడబడుతూనేవున్నది. వారి పెట్టుబడులు దినదినాభివృద్ధి పొంది ప్రతిఏటా 400 కోట్ల రూపాయలకు పైగా లాభాల రూపేణా విదేశాలకు తరలించుకపోతున్నారు. కొద్దిమంది ధనికుల ప్రయోజనాల్ని మాత్రం కాపాడే యీ మైనారిటీవర్గ ప్రభుత్వం దొరికిన చోటంతా అప్పు తెచ్చి దేశాన్ని ఒక దివాళా కొంపగా మార్చింది. గ్రామీణప్రాంతాల్లో నివసిస్తున్న 70 శాతం ప్రజానీకం నేటికీ అతిక్రూరమైన భూస్వామ్య దోపిడీకిగురై అర్ధాకలితో అతినికృష్టమైన జీవితాన్ని కొనసాగిస్తున్నారు. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిరుద్యోగం ప్రబలిపోయింది. పట్టణ ప్రజల జీవన పరిస్థితి నానాటికీ దిగజారుతున్నది.

అన్ని చెడుసాంప్రదాయాలకు ఆలవాలమైన యీ వ్యవస్థనుగాని, దీన్ని పెంచిపోషించే యీప్రభుత్వాన్నిగాని యింకెంతోకాలం ప్రజలు సహించటానికి సిద్ధంగాలేరు. బూర్జువా ఎన్నికలద్వారా రాజకీయాధికారం దోపిడీదారులనుండి ప్రజలహస్తగతంకాదని వారుఅనుభవంద్వారా తెలుసుకున్నారు సాయుధపోరాటాన్ని దానికిప్రత్యామ్నాయమార్గంగా ఎన్నుకున్నారు. ప్రజల అవగాహనలో వచ్చిన యీమార్పువల్ల నక్సల్‌బరీలో రాజుకొన్న నిప్పురవ్వ దావానలంగా దేశమంతా వ్యాపించింది. మనరాష్ట్రంలోనూ శ్రీకాకుళం వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలలో ప్రజలు యీ దోపిడీ వ్యవస్థను కూలదోయటానికి సాయుధపోరాట మార్గాన్ని చేపట్టారు. దోపిడీ మూకలపైఅనేక విజయాలు సాధించారు. దీన్నిసహించలేని పైశాచిక కాంగ్రెసు ప్రభుత్వం ప్రజాపోరాటాలపై వచ్చిఫాసిస్టు హింసాకాండను కొనసాగిస్తున్నది. మెజారిటీ ప్రజల ప్రయోజనాలకై తమశక్తినీ, రక్తాన్నీ ధారపోస్తున్న వందమందికి పైగా విప్లవకారులను నిరంకుశదోపిడీ ప్రభుత్వంవిచారణలేకుండా కాల్చిచంపింది ఇంకాఅనేకమందిని క్రూరచిత్రహింసలతో, నిర్బంధాలతో, కుట్రకేసుల నెపంతో బాధిస్తున్నది. ప్రజాకవి సుబ్బారావు పాణిగ్రాహికూడా యిలావిచారణలేకుండా కాల్చిచంపబడ్డవారిలో ఒకడు. ఇంతైనా విప్లవోద్యమాలు చల్లారలేదు, చల్లారవు మరింతగా రాజుకొంటున్నయ్.

ఇలాంటిపరిస్థితులలో యీసమాజం పూరాలనిదృఢంగా కోరేయే రచయితా చేతులు ముడుచుకొని కూర్చోడు. ప్రజల్లో పెంపొందుతున్న విప్లవ చైతన్యాన్ని మరింత పెంపొందించేందుకు తనకలాన్ని కత్తిగా వుపయోగించి తీరుతాడు, ఈనాటి ప్రజాపోరాటాలను ప్రతిబింబించే విప్లవ సాహిత్యాన్ని సృష్టిస్తాడు, ఈచారిత్రక కర్తవ్యంనిర్వర్తించేదుకే విప్లవ రచయితల సంఘం వుట్టుకొచ్చింది. ఈసంఘాన్ని దెబ్బతీయాలని పెండ్యాల కిషన్‌రావు, డాక్టర్ ఎం. వి. రమణారెడ్డి, ఉమ్మెంతల వెంకటరెడ్డి (విద్యుల్లత నిర్వాహకుడు) చిరంజీవి, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండరాజు, వరవరరావు, యం. టి. ఖాన్ మున్నగు విరసంసభ్యులను ప్రభుత్వం అరెస్టు చేయటమేకాకుండా విప్లవ సాహిత్యాన్ని నిషేధిస్తున్నది. ఐనావిప్లవభావాలు, విప్లవ రచయితల సంఘం మరింతలోతుగా ప్రజల్లో చొచ్చుకపోతున్నయ్. విరసం పురోగమిస్తూనేవుంది. ఈ సంఘాన్ని మరింత పటిష్ఠం చేసి. ప్రజలకు మరింత దగ్గరయేందుకు తగిన కార్యక్రమాన్ని రూపొందించుకొనుటకు తన నాల్గవ మహాసభను కర్నూలులో జరుపుకొనుటకు నిశ్చయించింది. ఈ మహాసభలను జయప్రదం చేయటానికై అన్ని ప్రాంతాలలోని విప్లవాభిమానులైన కార్మిక కర్షకులూ, యువకులు, విద్యార్థులు, మేధావులు విరాళాలు సేకరించి నిర్వాహక సంఘానికి పంపవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

విరాళాలు పంపవలసిన అడ్రసు–

సారంగ బలరామయ్య
కాగడా బుక్ హౌస్,
కర్నూలు.

ఇట్లు
ఆహ్వాన సంఘం
24–11–1973

కార్యక్రమాలు:-

1. 13, 14 తేదీలు రెండు రోజులూ సాయంత్రము బహిరంగ సభలు జరుగును.
2. బహిరంగ సభల అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహింపబడును.

ప్రతినిధులు జనవరి 12వ తేదీ రాత్రికి కర్నూల్ చేరుకొని 13 ఉదయానికల్లా తమ అర్హతలు నిరూపించుకోవాలి.

12వ తేదీ వుదయం నుంచీ బస్ స్టాండులోనూ, రైల్వే స్టేషన్‌లోనూ వాలంటీర్లు వుంటారు.

సంస్మరణ: గన్నూ పెన్నూ ఒకటిగా వాడిన కవి
కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి

1969 డిసెంబర్ 22వ తేదీన పంచాది నిర్మల, రమేశ్ చంద్రసాహు వంటి మరో ఐదుగురు విప్లవకారులతో పాటు పోలీసుల గుండ్లకు బలియైపోయిన అమరుడు కళాకారుడు, విప్లవకారుడు సుబ్బారావు పాణిగ్రాహి. ఒరిస్సా-ఆంధ్ర సరిహద్దుల్లో పోలీసులు చుట్టుముట్టిన సమయానికి సుబ్బారావు వ్యాధితో బాధ పడుతున్నడు.

పాణిగ్రాహి చాల అరుదైన కమ్యూనిస్టు బహుశా భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలోనే ఆయనకు సాటి ఎవరూ లేరు చైర్మన్ మావో యిలా అన్నాడు. "చైనా ప్రజల విముక్తికోసం మనం సాగిస్తున్న పోరాటంలో చాల రంగాలున్నయి. కలంతో పోరాడే సాంస్కృతికరంగం. తుపాకితో పోరాడే మిలిటరీ రంగం వాటిలో ప్రధానమైనవి. శత్రువును ఓడించడానికి మనం ప్రధానంగా తుపాకుల సైన్యంమీద ఆధారపడాలి. కాని యీ సైన్యం మాత్రమే చాలదు; మనకు సాంస్కృతిక సైన్యంకూడ వుండాలి. మన ప్రజలనందరినీ సమైక్యంచేసి శత్రువును ఓడించడానికి ఇది అనివార్యమైన అవసరం."

కామ్రేడ్ పాణిగ్రాహి మిలిటరీ రంగంలోనూ సాంస్కృతిక రంగంలోనూ అసమానమైనయోధుడు. ఆయన చనిపోయేనాటికే ఆంధ్రలోనుప్రసిద్ధమైన విప్లవ రచయితగా పేరు తెచ్చుకున్నాడు. శ్రీకాకుళంలో సాయుధ రైతాంగ పోరాటం ప్రారంభమయినప్పుడు ఆయన పాటలు, కవితలు ఆంధ్రదేశమంతా మార్మోగినవి. ఈ విప్లవకవి, గాయకుడు తుపాకి చేతబట్టి, గెరిల్లా దళాలను నిర్మించి స్వయంగా నాయకత్వంవహించి, వర్గ శత్రు నిర్మూలన చేసి, గ్రామ సీమల్లో భూస్వాముల, పెట్టుబడిదార్ల, వాళ్ళ తొత్తుల వగపాలనను అంతం చేయడానికి ఒక్కలిప్తకాలమైనా సందేహించలేదు.

సోంపేట తాలూకాలోని ఒరియా కుటుంబంలో పుట్టిన పాణిగ్రాహి బడిలో చదువుకున్న కాలంలోనే కమ్యూనిస్టు ఉద్యమంలో చేరాడు. అప్పుడు తెలంగాణ సాయుధ పోరాటం సాగుతున్న కాలం. ఆంధ్రలో రివిజనిజానికి వ్యతిరేకంగా, రివిజనిజం ఎన్నో రూపాల్లో తలఎత్తిన అన్ని వేళల్లోనూ పోరాటం సాగించిన వారిలో పాణిగ్రాహి ఒకడు. రివిజనిస్టులకు పాణిగ్రాహి సింహ స్వప్నం. తెలుగు దేశమంతటా విరివిగా ప్రచారంలోవున్న ఆయన విప్లవ పాటలు, కవితలు రివిజనిజాన్ని నిర్దాక్షిణ్యంగా దాని నిజరూపంలో బయట పెట్టినవి.

"డబ్బులకై ఆశయాలు అంగడిలో అమ్మకోము
నిర్బంధాలకు భయపడి రివిజనిస్టులము కాము."

ఆయన పాటలు, కవితలు, విప్లవ కంఠం ఎత్తిన ఎర్ర జెండాలు. విప్లవ ఖడ్గం పాడిన రక్త గీతాలు.

ఆయనకు జానపద కళల్లో చాల అభిరుచి. 'జముకుల కథ'అనే ఒక విధమైన సంగీత రూపకాన్ని ఆయన ప్రజాదరణలోకి తెచ్చాడు. ఇందులో ముగ్గురు నటులుంటారు. పాణిగ్రాహి కట్టిన దళంలోవున్న కామ్రేడ్ తామాడ చిన్నారావు అనే 14 సంవత్సరాల బంగారుబాబు విప్లవంకొరకు కామ్రేడ్ పంచాది కృష్ణమూర్తితోపాటు తన ప్రాణాలు బలి యిచ్చాడు. జముకుల కథకు దర్శకుడు, ప్రధాన నటుడుకూడ పాణిగ్రాహే. గిరిజన రైతాంగ పోరాటం యీ రూపకానికి వస్తువు. తెలుగుదేశమంతటా యీ జముకుల కథను ప్రదర్శించి యీ విప్లవకవి, నాటకకర్త, గాయకుడు ప్రజల్లో ఒక విప్లవ వెల్లువలాంటి చైతన్యాన్ని సృష్టించగలిగాడు. కామ్రేడ్ పాణిగ్రాహి రచనల్లో రాజకీయాలకు కళకు ఐక్యత సిద్ధించింది. విప్లవ రాజకీయ వస్తువుకు, కళానైపుణ్యానికి పాణిగ్రహణం చేసినవాడు పాణిగ్రాహి.

కామ్రేడ్ పాణిగ్రాహి కవి-విప్లవకారుడు. ఆయనకు కవికుండే ఆవేశం ఉండేది. అందుకేఆయన మాటలెప్పుడూ వెచ్చదనంతో కాంతివంతంగాఉండేవి. ఆయనెప్పుడూ నిరుత్సాహంగా చల్లగా మాట్లాడి ఎరుగడు.ఆయన ఆవేశమంతా విప్లవ ఆవేశమే. సాయుధ పోరాటంలో చేరడానికి ఇల్లు వదిలేముందు వృద్ధురాలయిన తల్లితో ఇలా అన్నాడు "అమ్మా నన్ను, నిన్ను వదలి వెళ్ళనివ్వు. నీ పట్ల నాకు బాధ్యతలున్నవి. కాని దుర్భరమైన దారిద్ర్యంలో దుఃఖంలో భారతదేశమంతట బ్రతుకుతున్న కోట్లాది తల్లుల పట్ల కూడ నా బాధ్యత ఉన్నది." పార్టీని వదలిపెట్టి ఆయన ప్రతిభను డబ్బు చేసుకోడాని కుపయోగించుకొమ్మని సలహా ఇచ్చిన వారికి ఆయనిట్లా చెప్పేవాడు "ప్రపంచంలో గొప్పతనంగా భావించబడేదేమైన ఉన్నదంటె అది కమ్యూనిస్టుగా బ్రతకడం, ప్రజల కొరకు పని చేయడం." చివరి నాలుగు నెలలు ఆయన తీవ్రమయిన వ్యాధితో బాధపడ్డాడు. కామ్రేడ్ భాస్కరరావు, కామ్రేడ్ గణపతులను పాశవికంగా పోలీసులు కాల్చివేసిన తరువాత సోంపేట ఏరియా కమిటీకి పాణిగ్రాహి కార్యదర్శిగా ఎన్నుకోబడ్డాడు. ఈ సోంపేట కమిటీయే చాల తాలుకాలలో సాయుధ పోరాటం వ్యాపించడానికి తోడ్పడ్డది. ఆయన అనారోగ్యంగా ఉన్నా నాయకత్వ బాధ్యతను స్వీకరించాడు. "నా ఆరోగ్యం ఇంక బాగుపడదు, రోగంతో చావడంకన్నా పోరాటంలో చావడం మేలు కదా!" అన్న కామ్రేడ్ కోరిక నెరవేరింది. ఆయన వీరోచితంగా మరణించాడు. ఒక అసమానమైన విప్లవకారుని మరణమది.

ఒరిస్సా ఆంధ్ర ప్రజల ఉత్తమ సంస్కృతిని తనలో జీర్ణించుకున్న పాణిగ్రాహి వాళ్ళ ఐక్యతకు చిహ్నం. ఈ రెండు గొప్పజాతులు ఈనాడు ఐక్యంగా విముక్తివైపు సాగే ప్రజాయుద్ధంలో కలసి ముందుకు సాగుతున్నారు.

కలాన్నీ, కత్తినీ ఒకేచేత పట్టిన విప్లవ కళాకారుడూ, విప్లవకారుడూ అయిన పాణిగ్రాహిని ఒరవడిగా పెట్టుకొని 1970 అక్టోబర్‌లో పాణిగ్రాహి నగర్ (ఖమ్మం)లో ఏర్పడిన విప్లవ రచయితల సంఘం ఆయన విప్లవ కళా దీక్షనూ, కదన దీక్షనూ స్వీకరించడానికి యీ నాల్గవ సంస్మరణ దినం రోజు ప్రతిజ్ఞ తీసుకుంటుందని ఆశిద్దాం.

22 డిసెంబర్ 73

23 డిసెంబర్ రాష్ట్ర పౌర హక్కుల మహాసభ సందర్భంగా.

26 డిసెంబర్ 73 చైర్మన్ మావో 80వ జన్మదినోత్సవ సందర్భంగా

విమోచన

రాజకీయ పక్షపత్రిక

36 పేజీలతో చైర్మన్ మావో ముఖచిత్రంతో ప్రత్యేక సంచికగా వెలువడింది

భారత చైనా మిత్రమండలి మహాసభ (6 జనవరి 74 ఒంగోలు),
వి. ర. సం. మహాసభల (13, 14 జనవరి కర్నూలు)
సందర్భంగా భారత చైనా ప్రజల మైత్రికి అంకితంగా
జనవరి 1, 15 సంచికలు ఒకటేగా ఎక్కువ పేజీలతో వెలువడుతుంది.

పిలుపు

16-12-1973 సంచిక వెలువడింది. **వెల 35 పైసలు**

ఈ సంచికలో మన దేశాన్ని సోవియట్ సామ్రాజ్యవాదుల నయావలసగానూ, చైనా వ్యతిరేక యుద్ధ కేంద్రంగానూ మార్చే ఇందిరా-బ్రెజ్నెవ్ కుట్రను అడుగడుగునా ప్రతిఘటించాలి.

పౌరహక్కుల ఉద్యమాలు ప్రజలలో విప్లవ చైతన్యాన్ని కలిగించడానికి ఉపయోగపడాలి.

సోవియట్ రివిజనిస్టుల 'నిరాయుధీకరణ' ప్రతిపాదన కేవలం చౌకబారు ప్రచారం మాత్రమే.

వ్యవసాయ విప్లవ పరిపూర్తికి ప్రజా సైన్యాన్ని నిర్మించడం విప్లవ స్థావరాలను నిర్మించడం తప్పనిసరి — అనే వ్యాసాలు ఉన్నాయి.

ప్రతులకు: **పిలుపు 13-1-1/61 సీతారాంబాగ్, హైదరాబాద్-506001**

సృజన వద్ద కూడ దొరుకుతుంది.

SRJANA Telugu Monthly **Jan. '74** **H-1088**
Regd. No. with Registrar of News Papers 10953/67

1967 నక్సల్‌బరీ రైతాంగ సాయుధ పోరాటకాలం నుంచి
1973 దాకా శ్రీకాకుళంలోనూ, తెలంగాణలోనూ
పోలీసుల పాశవిక హింసాకాండకు గురియై మరణించిన

అమరవీరుల జీవిత చరిత్రలు

180 పేజీలు, 24 ఫోటోలతో

వెలువడింది! **పిలుపు ప్రచురణ** **వెల: 3 రూపాయలు**

ప్రతులకు: 1. పిలుపు, సీతారాంబాగ్, హైదరాబాద్-500001.
2. సృజన, హనుమకొండ, వరంగల్-506001.

స్పష్టంగా, సమగ్రంగా, స్వంతంగా
భారత రైతాంగ సాయుధ పోరాటం పట్ల
చారుమజుందార్ ధోరణిని అవగాహన చేసుకోవాలంటే

చ ద వం డి!

చారుమజుందార్ వ్యాసాలు

ప్రతులకు: శ్రామికవర్గ ప్రచురణలు
9-10-110 పిన్నావారి వీధి, గిర్మాజీపేట
వరంగల్-506002.

వెల: 350 పైసలు

సృజన దగ్గర కూడా కాపీలు దొరుకుతాయి.

1-00

SRJANA
Hanamkonda
Warangal 506001